

లారీ దెబ్బలు తట్టుకోలేక విలవిలలాడుతున్న పవన్

తిరుపతిలో మళ్లీ పడగవిప్పిన అరాచకం

తిరుపతిలో అరాచక భూతం మళ్లీ నిద్రలేచింది. కాస్త ప్రశాంత వాతావరణం ఏర్పడుతోంది అనుకునేలోగానే విచ్చలవిడి దాడులకు తెగబడుతున్నారు. దబాయింపులు.. దౌర్జన్యాలు.. హింసాత్మక సంఘటలూ పెచ్చుపెరుగుతున్నాయి. గురువారం సోషల్ మీడియాలో వైరల్ అయిన దృశ్యాలు నగర ప్రజలను భయకంపితులను చేశాయి. బకాయి ఉన్నాడంటూ ఒక దళిత యువకుడిని పోలీసులు వాడే ఫైబర్ లాఠీతో విచక్షారహితంగా కొడుతున్న దృశ్యాలు చూసిన వారి ఒళ్లు జలదరించింది.

తిరుపతి (నేరవిభాగం), ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కాళ్లతో తన్నారు. ఫైబర్ లాఠీతో చితకబాదారు. దుడ్డు కర్రతో విచక్షణారహితంగా కొట్టారు. ఒళ్లంతా రక్తమైనా, అన్నా.. వదలంటూ కాళ్లు పట్టుకున్నా, కనికరించలేదు. వైరల్ అయిన ఈ దాడి దృశ్యాలు పోలీసులకు చేరడంతో రంగంలోకి దిగారు. మరోవైపు బాధితుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. తిరుపతి పోలీసుల కథనం మేరకు.. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం మొరవపల్లికి చెందిన నీలం జయరాజ్ కుమారుడు పవన్‌కుమార్ తిరుపతిలోని ఓ రెసిడెన్సీలో రిసెప్షనిస్టు. తిరుపతి వైసీపీ సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కారు డ్రైవర్ అయిన అనిల్‌కుమార్‌రెడ్డి శ్రీనివాసం ఎదురుగా ఎస్వీపీ బైక్ రెంటల్స్ పేరిట ద్విచక్ర వాహనాలను అద్దెకు ఇస్తున్నాడు. నెల కిందట పవన్‌కుమార్ డియో హోండా బైక్‌ను అద్దెకు తీసుకున్నాడు. దాదాపు 20 రోజులుగా బాడుగ చెల్లించలేదు. ఈ క్రమంలో స్విమ్స్ వద్ద ఉన్న పవన్, అతడి స్నేహితుడిని అనిల్ అనుచరుడు, మరో బైక్ రెంటల్ యజమాని జగదీశ్వర రెడ్డి అలియాస్ జగ్గూ, అజయ్‌కుమార్ బుధవారం మధ్యాహ్నం అనిల్‌కుమార్ రెడ్డి కార్యాలయానికి తీసుకొచ్చారు. అంతలో పాకాలకు చెందిన.. కొర్లగుంటలో ఉంటూ ఫైనాన్సు సెటిల్‌మెంట్లు చేస్తున్న వైసీపీ నేత దినేష్ అక్కడకు చేరుకున్నాడు. ఫైబర్ లాఠీతో పవన్‌ను విచక్షణా రహితంగా దినేష్ కొట్టాడు. ఒళ్లు రక్తంతో కమిలిపోయి అన్నా.. కొట్టొద్దు.. కొట్టొద్దు అంటున్నా విడిచిపెట్టలేదు. చిత్రహింసలకు గురిచేశాడు. అనిల్‌కుమార్ రెడ్డి కూడా లాఠీతో చితకబాదాడు. ఈ ఘటనను పవన్ స్నేహితుడు వీడియోలు తీసి గ్రూపుల్లో వైరల్ చేశారు. ఈ వీడియోలను నీలం జయరాంకు అనిల్ పంపి.. మీ కుమారుడు మాకు డబ్బులివ్వాలని చెప్పడంతో తాను వచ్చి ఇస్తానని ఆయన చెప్పారు. అక్కడ్నుంచి పవన్‌కుమార్‌ను పంపేశారు.



ఈస్ట్ పోలీసు స్టేషన్‌లో అనిల్‌రెడ్డి

పలు సెక్షన్ల కింద కేసులు: డీఎస్పీ

నిందితులు అనిల్‌కుమార్ రెడ్డి, దినేష్, జగదీశ్వర రెడ్డిను అదుపులోకి తీసుకుని కిడ్నాప్, హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ, చిత్రహింసలకు గురి చేయడం వంటి సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం గురువారం చెప్పారు. వీరిపై రౌడీ షీట్ ఓపన్ చేస్తామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారెవరైనా వదలి పెట్టేది లేదన్నారు. ఈ దాడి ఘటనలో నిందితులైన వైసీపీ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి వంగలపూడి అనిత పోలీసులను ఆదేశించారు. ఈ ఘటన వెనుక సూత్రధారులను వదలిపెట్టేది లేదన్నారు.

పవన్ ఎక్కడ?

ఈ ఘటన తర్వాత పవన్ కనిపించలేదు. ఆయన మొబైల్ ఆన్ చేసి.. తర్వాత ఆఫ్ చేస్తున్నారు. ఇతడి కోసం సీఐ రామయ్య, సిబ్బంది గాలించారు. కల్లూరు మండలం ఇస్త్రాకులపల్లె వద్ద స్నేహితుడు జానకిరామ్‌తో పవన్ ఉన్నట్లు గుర్తించి వెళ్లారు. అప్పటికే పవన్ వెళ్లిపోగా, జానకిరామ్‌ను మాత్రం గురువారం రాత్రి తిరుపతికి తీసుకొచ్చారు.

అదుపులో ముగ్గురు నిందితులు

కాగా, వైరల్ అయిన వీడియోలు పోలీసులకూ చేరాయి. నిందితులను పట్టుకునేందుకు డీఎస్పీ భక్తవత్సలం నేతృత్వంలో వర్సిటీ సీఐ రామయ్య, ఈస్ట్ ఎస్ఐ గిరిబాబు, ఈస్ట్ హెడ్ కానిస్టేబుల్ జ్యోతినాథ్, సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పద్మావతి పురంలో ఉన్న అనిల్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల హెచ్చరికలతో బుధవారం అర్ధరాత్రి జగదీశ్వరరెడ్డి ఈస్ట్ స్టేషన్‌లో లొంగిపోయాడు. వీరిని విచారించాక దినేష్, అజయ్‌కుమార్ కూడా ఉన్నట్లు తెలిసింది. గురువారం సాయంత్రం దినేష్‌ను చింతలచేను బస్టాపు వద్ద అదుపులోకి తీసుకున్నారు. ఈ ముగ్గురు పోలీసుల అదుపులో ఉండగా, అజయ్‌కుమార్ పరారయ్యాడు. వున్నారు. బాధితుడి తండ్రి జయరాజ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రూ.5 లక్షలు ఇవ్వకుంటే శవాన్ని పంపిస్తాం

- నిందితులు బెదిరించారంటూ పవన్ తల్లి ఆవేదన



సునీత

'మీ కొడుకు మావద్ద బైక్ రెంటల్‌కు తీసుకుని డబ్బులు ఇవ్వలేదు. అతడిని కొట్టిన వీడియోలు మీకు పంపాము. రూ.5 లక్షలు సాయంత్రానికంతా (బుధవారం) పంపకుంటే మీ కొడుకు కిడ్నీ తీసుకుని, శవాన్ని ఇంటికి పంపిస్తామని మాకు రెండు, మూడు నెంబర్ల నుంచి ఫోన్ చేశారు. మేము భయపడి పోయి మా కొడుకుని కాపాడాలంటూ తిరుపతి పోలీసులకు ఫిర్యాదు చేశాం' అంటూ పవన్ తల్లి సునీత గురువారం ఈస్ట్ పోలీసు స్టేషన్ వద్ద ఆవేదన వ్యక్తంచేశారు. 'తప్పు చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలి. అంతేకానీ రక్తం వచ్చేట్లు లాఠీతో కొట్టడానికి వీళ్లెవరు? బాగా కొట్టి.. ఇప్పుడు కనిపించకుండా చేశారు. వెంటనే నిందతులను అరెస్టు చేసి నా బిడ్డను కాపాడాలి' అంటూ ప్రాధేయపడ్డారు. ఆమెకు మద్దతుగా అంబేడ్కర్ సంఘం జిల్లా నాయకులు ధనశేఖర్, రమేష్, సమతా సైనిక దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చిరంజీవి, ఎస్సీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ప్రసాదరావు తదితరులు ధర్నా చేశారు.

ఆగని వైసీపీ అరాచకాలు



తిరుపతి, తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నప్పుడే కాదు.. ఇప్పుడూ తిరుపతిలో వైసీపీ అరాచకాలు ఆగలేదు. కొన్ని ఘటనలు చూస్తే..

ఎన్నికల ప్రచారంలో ప్రశ్నించాడని..

వారం కిందట తిరుమల బైపాస్ రోడ్డులో నడుచుకుంటూ వస్తున్న చందు(19)ను ఎర్రమిట్టకు చెందిన వైసీపీ నేత రాఖీ, మరో 17 మందితో కలసి బాటిల్ పగలగొట్టి పొడిచేశారు. వైసీపీ అభ్యర్థి అభినయ్ ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు 'ఆయన తిరుపతికి ఏమి చేశాడు?' అని చందు వ్యాఖ్యానించినట్లు వైసీపీ నాయకుల దృష్టికి వచ్చినట్టు సమాచారం. దీంతో వారం క్రితం తిరుపతికి వచ్చిన చందుపై గంజాయి బ్యాచ్‌ను వేసుకుని దారుణంగా పొడిచారు. కుటుంబీకులు రుయాస్పత్రికి తీసుకెళ్లి మెడికో లీగల్ కేసుగా నమోదు చేయించారు. ఓ వైసీపీ కార్పొరేటర్ ఒత్తిడితో అలిపిరి పోలీస్ స్టేషన్‌లోని ఓ ఎస్ఐ కేసు నమోదు చేయడానికి ఆసక్తి చూపలేదన్న ఆరోపణ వచ్చింది. దీనిపై బాధితులు గట్టిగా పట్టుబట్టడంతో పిటీ కేసు పెట్టి వదిలేశారని తెలిసింది. దీనిపై బాధితులు ఎస్పీ కార్యాలయంతో పాటు, మానవహక్కుల కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైనట్టు సమాచారం.

అనిల్ రెడ్డికి ఇలాంటివి కొత్తేమి కాదు : పవన్‌పై అమానుషంగా దాడికి పాల్పడిన ఘటనకు కారణమైన అనిల్‌రెడ్డి ఇటీవల 14వ డివిజన్లో టీడీపీ జెండా పైన వైసీపీ జెండా కట్టి రాజకీయ విద్వేషాలు రెచ్చగొట్టారు. దీనిపై టీడీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదుచేసినా ప్రయోజనం కనిపించలేదు.

సెటిల్మెంట్ల చైతన్య :

అభినయ్ ప్రధాన అనుచరుడు, ఎస్టీవీనగర్‌కు చెందిన చైతన్యకుమార్ యాదవ్ గత నెలలో చింతలచేను వద్ద ఓ కార్ డెకార్స్‌కు సంబంధించి దుకాణం ఇచ్చేయాలంటూ దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. లీలామహల్ రోడ్డులో కృష్ణ కాంప్లెక్సులో ఓ గది అద్దెకు తీసుకుని బాడుగ చెల్లించలేదు. ఖాళీ చేయలేదు. దీంతో గది యజమాని రూము ఖాళీచేసి ఇతరులకు బాడుగకు ఇచ్చారు. దీంతో చైతన్య వెళ్లి కార్యాలయంలోని అద్దాలు, పర్నిచర్ ధ్వంసం చేశాడు. ఈ రెండు ఘటనల్లో కేసులు నమోదయ్యాయి. వైసీపీ హయాంలో సూపర్ పోలీస్‌గా ఇతడు వ్యవహరించాడన్న ప్రచారం ఉంది. ఉన్నత స్థాయి అధికారులు సైతం చైతన్య చెప్పిందే చేయాలన్న ఆదేశాలు వైసీపీ నేతలు ఇచ్చారన్న విమర్శలున్నాయి. ఇప్పుడూ కొందరి పోలీసుల సహకారంతోనే సెటిల్మెంట్లు చేస్తున్నాడన్న ప్రచారం జరుగుతోంది.

రౌడీల ఆగడాలు సాగనివ్వం: ఎస్పీ

తిరుపతిలో రౌడీల ఆగడాలు సాగనివ్వబోమని ఎస్పీ హర్షవర్ధనరాజు హెచ్చరించారు. పవన్‌పై దాడి చేసిన వారిని శిక్షిస్తామన్నారు. హోంమంత్రి ఆదేశాల మేరకు ఘటన జరిగిన వెంటనే నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు.

నవోదయలో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయాల్లో 9, 11 తరగతుల్లో 2026-27 సంవత్సరానికి ప్రవేశాలు పొందేందుకుగాను ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ గురువారం తెలిపారు. 9వ తరగతిలో ప్రవేశం పొందగోరు విద్యార్థి జిల్లాలో ఏదేని ప్రభుత్వ గుర్తింపు కలిగిన పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరంలో 8వ తరగతి చదువుతూ ఉండాలని, 2011 మే ఒకటి నుంచి జూలై 31 మధ్య జన్మించిన వారై ఉండాలని పేర్కొన్నారు. 11వ తరగతిలో ప్రవేశం పొందగోరు విద్యార్థులు 2009 జూన్ ఒకటి నుంచి 2011 జూలై 31 మధ్య కాలంలో జన్మించి, 2025-26 విద్యా సంవత్సరంలో జిల్లాలో ఏదేని ప్రభుత్వ గుర్తింపు కలిగిన పాఠశాలలో 10వ తరగతి చదువుతూ ఉండాలని సూచించారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు 2025 సెప్టెంబరు 23వ తేదీలోపు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2026 ఫిబ్రవరి 7వ తేదీన పరీక్ష ఉంటుందని తెలిపారు. www.navodaya.gov.in వెబ్‌సైట్ ద్వారా మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చని చెప్పారు.

4 ఆలయాల ట్రస్టుబోర్డుల నియామకానికి నోటిఫికేషన్

తిరుపతి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాలుగు ప్రధాన ఆలయాల ట్రస్టుబోర్డుల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. రూ.కోటి నుంచీ రూ.5 కోట్ల నడుమ వార్షికాదాయం కలిగిన 56 ఆలయాలకు పాలకమండళ్లను నియమించేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో జిల్లాకు చెందిన ఆలయాలు నాలుగున్నాయి. తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ, చిల్లకూరు మండలం తూర్పు కనుపూరులోని ముత్యాలమ్మ, తమ్మినపట్నం కోదండరామాలయంతో పాటు సురుటిపల్లిలోని పల్లికొండేశ్వరస్వామి ఆలయాల పాలకమండళ్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానించింది. 20 రోజుల్లోపు ఆసక్తి అర్హత ఉన్నవారు దరఖాస్తులను ఆయా ఆలయాల కార్య నిర్వహణాధికారులకు అందజేయాల్సి ఉంటుంది. .

శ్రీకాళహస్తి 'హరిత' ప్రైవేటీకరణకు అనుమతి

తిరుపతి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి శివార్లలోని ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు చెందిన హరితా హోటల్ నిర్వహణను ప్రైవేటు వ్యక్తులు లేదా సంస్థలకు అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. కొత్త టూరిజం పాలసీకి అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా 22 ఏపీటీడీసీ హోటళ్ళు, రిసార్టుల నిర్వహణను ప్రైవేటు వ్యక్తులు, సంస్థలకు అప్పగించేందుకు ఆ శాఖ చేసిన ప్రతిపాదనను ఇటీవల మంత్రిమండలి ఆమోదించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో 25 గదులున్న శ్రీకాళహస్తి హరితా హోటల్ నిర్వహణ ప్రైవేటు సంస్థలచేతికి వెళ్ళనుంది.

అక్షరాస్యత పెంపునకు కృషి చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

రామచంద్రాపురం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): అక్షరాస్యతకు అందరూ కృషి చేయాలని ఈవోపీఆర్డీ శ్రీనివాసులు కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో అక్షర ఆంధ్ర ఉల్లాస్‌పై శిక్షణా కార్యక్రమం గురువారం జరిగింది. ఈసందర్భంగా ఏపీఎం గురుమూర్తి మాట్లాడుతూ పొదుపు సంఘాల్లో ప్రతి మహిళను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి సంఘమిత్రలు కృషి చేయాలన్నారు. మహిళలు అక్షరాస్యత సాధించినపుడే కుటుంబం ఆర్థికంగా ఎదుగుతుందన్నారు. వయోజన విద్య సూపర్‌వైజర్ శైలజ, డీఎంజీ సుమతి, వెలుగు సీసీ సుధాకర్, సంఘమిత్రలు పాల్గొన్నారు.

ముగిసిన తల్లిపాల వారోత్సవాలు


అవగాహనా ర్యాలీలో వైద్యులు, సిబ్బంది

చంద్రగిరి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు గురువారం ముగిశాయి. ఈసందర్భంగా ఎస్వీ మెడికల్ కాలేజీ కమ్యూనిటీ మెడిసిన్ ,హెచ్‌వోడీ డాక్టర్ సునీత అధ్యక్షతన గ్రామీణ ఆరోగ్య శిక్షణ కేంద్రం హెల్త్ ఆఫీసర్ డాక్టర్ .యుగంధర్ ఆధ్వర్యంలో సదస్సు, భారీ ర్యాలీ నిర్వహించారు. పుట్టిన గంటలోపే బిడ్డకు ముర్రుపాలిస్తే వ్యాధి నిరోధక టీకాగా పనిచేస్తుందని వక్తలు పేర్కొన్నారు, శ్వాసకోశ, పేగు సంబంధిత వ్యాధులు రావన్నారు. కమ్యూనిటీ మెడిసిన్ డిపార్ట్మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివ, అసిస్టెంట్ ప్రొఫెసర్ కళ, డాక్టర్లు దయాకర్, హేమచంద్ర, హేమలత, శ్రీధర్, మధుసూదనరావు, సౌమ్య ప్రియ, రేవతి పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలన పోస్టర్ల ఆవిష్కరణ



తిరుపతిరూరల్, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): ఏడాదిపైబడి వయస్సు ఉన్న పిల్లలందరికీ నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని ఎంఈవో-1 మహమ్మద్ రఫీ సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంఈవో-2 శంకరయ్య, మంగళం పీహెచ్‌సీ సిబ్బందితో ఆయన కలసి నులిపురుగుల నిర్మూలన పోస్టర్లని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..మండలంలోని అన్ని పాఠశాలలో మధ్యాహ్న భోజనం తర్వాత విద్యార్థులతో ఈమాత్రలని మింగించాలన్నారు. రక్తహీనత నివారణకు ఈమాత్రలు ఉపయోగపడుతాయని తెలిపారు. ఎంపీహెచ్‌ఈవో మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

జన సురక్ష పథకాలు సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న రీజనల్ హెడ్ పరశురాం

భాకరాపేట, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం జనసురక్ష పథకాలు సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంకు డిప్యూటీ రీజనల్ హెడ్ పరశురాం నాయక్ సూచింరు. చిన్నగొట్టిగల్లు మండలం తిప్పిరెడ్డిగారిపల్లె పంచాయతీ ఎడంవారిపల్లెలో కేంద్ర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాల వల్ల బీమా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ లక్ష్మణ్, ఏపీఎం స్వర్ణలత, సీసీ శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కీచక వధ

రామచంద్రాపురం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఎన్‌ఆర్‌కమ్మపల్లి మహాభారత ఉత్సవాల్లో భాగంగా గురువారం భాగవతారిణి జ్యోత్స్న ప్రదర్శించిన కీచక వధ సభికులను ఆకట్టుకుంది. వివిధ ఘట్టాలను రమ్యంగా వినిపించారు. అంతకుముందు ఆలయంలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఉత్సవమూర్తులకు తిరుమంజనం చేశారు. ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవమూర్తిని ఊరేగించారు. వెంకటేశ్వర నాట్య కళామయండలి ఆధ్వర్యంలో కీచకవధ భాగతవం రక్తి కట్టించింది. ఆలయ ధర్మకర్త రమేష్, గ్రామపెద్ద మార్కొండయ్యనాయుడు, ప్రధాన అర్చకులు హరిస్వామి పాల్గొన్నారు.

అవకతవకలపై విచారణ చేపట్టాలి: టీడీపీ


మాట్లాడుతున్న టీడీపీనేత మనోహర్‌చౌదరి

తిరుపతిరూరల్, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): సి.మల్లవరం పంచాయతీల్లో జరిగిన అవకతవకలపై సత్వరమే విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు మనోహర్‌చౌదరి కోరారు. గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పంచాయతీలో ఇంటి పన్నులు, భవన నిర్మాణ అప్రూవల్స్, కుళాయి కనెక్షన్ల కోసం వసూలు చేసిన నిధులు జమచేయలేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సిబ్బందికి జీతభత్యాల చెల్లించారని ఆరోపించారు. పంచాయతీ రికార్డుల్లో నమోదు చేయకుండా సర్పంచ్ నేతృత్వంలో దాదాపు రూ.1.50కోట్ల నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. డీఎల్‌పీవో సురేష్‌నాయుడు సర్పంచ్‌ని వివరణ కోరుతూ మెమో జారీ చేశారని, ఐదునెలలు గడిచినా విచారణలో జాప్యం జరుగుతోందన్నారు. పార్టీగ్రామకమిటీ ఉపాధ్యక్షుడు నవీన్‌రాజా, నేతలు షావలి, షఫీఉల్లా, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

నిరాధార ఆరోపణలు సరికాదు: సర్పంచ్

టీడీపీనేతల ఫిర్యాదు మేరకు అధికారులు రికార్డులను తీసుకెళ్లి విచారిస్తున్నారని, నిజానిజాలు నిగ్గు తేలకముందే టీడీపీ నాయకులు నిరాధార ఆరోపణలు చేయడం దారుణమని గ్రామసర్పంచ్ మొక్కల భారతి పేర్కొన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించిన అన్ని బిల్లులు విచారణాధికారికి సమర్పించామన్నారు. ఆధారాలు చూపకుండానే ఆరోపణలు చేయడాన్ని ఖండించారు.

సినిమా షూటింగ్ ప్రారంభం

భాకరాపేట, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): గురువారం జైచిరంజీవ ఆర్ట్స్ క్రియేషన్స్ బ్యానర్‌పై కుటుంబ కథా చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. ఈక్రమంలో గురువారం కోదండ రామాలయంలో ముహూర్తపు సన్నివేశాలను చిత్రీకరించారు. దర్శకుడు వాసుదేవ మాట్లాడుతూ ప్రధాన పాత్రధారులుగా సీతారాం సుందరమ్మ, తమ్మిశెట్టి మురళీరాయల్, కుమారి, సంధ్య నటిస్తున్నారన్నారు. ఆల్డిన్ సంగీతం సమకూర్చుతున్నారని వివరించారు.

బస్సు షెల్టర్ తొలగించిన వారిపై ఫిర్యాదు

చంద్రగిరి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తొండవాడ వద్ద బస్సు షెల్టర్, మర్రి చెట్టును తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం రాత్రి వైసీపీ నాయకులు తమ వెంచర్‌కు అడ్డంగా ఉందని బస్ షెల్టర్, కూల్చివేసిన సంగతి తెలిసిందే. గురువారం రెవెన్యూ, సర్వే అధికారులు కొలతలు వేసి వివరాలను పోలీసులకు నివేదించారు. దీనిపై పోలీసులు, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా విచారిస్తున్నారు. షెల్టర్‌ను కూల్చివేసి, మర్రి చెట్టును చెట్టును కూలదోయడానికి ప్రయత్నించిన వారిపై వాల్టా చట్ట ప్రకారం వారిపై కేసు నమోదు చేసి, చర్యలు గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఇన్‌చార్జ్ సీఐ ఇమ్రాన్‌బాషా ధ్రువీకరించారు.

విశ్రాంతి లేకుండా వాహనాలు నడపవద్దు


భక్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ

తిరుమల, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): తిరుమలకు దూర ప్రాంతాల నుంచి వాహనాల్లో వచ్చిన భక్తులు తగినంత విశ్రాంతి తీసుకున్న తర్వాతే వెనక్కి ప్రయాణించాలని తిరుమల డీఎస్పీ విజయ్‌శేఖర్ సూచించారు. తిరుమల నుంచి తిరుగు ప్రయాణాల్లో భక్తులు ప్రమాదాలకు గురవుతున్న సంఘటనల నేపథ్యంలో తిరుమల టోల్‌గేట్ వద్ద ట్రాఫిక్, రవాణాశాఖాధికారులతో కలిసి భక్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులు రెండుమూడురోజుల పాటు సరైన నిద్ర లేకుండా, అలిసిపోయి తిరుగు ప్రయాణంలో నిద్రమత్తులో ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ప్రతి వంద కిలోమీటర్లకు ఓసారి వాహనం ఆపి కొద్ది సమయం విశ్రాంతి తీసుకోవాలన్నారు.

అమ్మవారి సేవలో మంత్రి అనగాని



తిరుచానూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని గురువారం ఉదయం జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ దర్శించుకున్నారు. ఆలయం వద్ద డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, సూపరింటెండెంట్ రమేష్ ఆయనకు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం ఇచ్చి అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు.

'వైసీపీపై అసత్య ప్రచారం చేస్తే ఊరుకోం'

తిరుపతి(ఎంఆర్‌పల్లె), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తలపై అసత్య ప్రచారాలు చేస్తే ఒప్పుకోమని ఆ పార్టీ లీగల్ సెల్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ పార్టీ సోషల్ మీడియా జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డిపై తప్పుడు కేసుపెట్టారన్నారు. పవన్ అనిల్‌రెడ్డికి రూ.30వేలు ఇవ్వాల్సి ఉందన్నారు. జనసేన నేత దినేష్, అతని అనుచరులు పవన్‌పై దాడి చేసి, ఆ నిందను అనిల్‌రెడ్డిపై వేశారన్నారు. డీఎస్పీ స్థాయి అధికారే అనిల్‌రెడ్డి తప్పులేదని చెబుతుంటే కూటమి నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు.

యూరియా కొరత తీర్చండి

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు యూరియా కొరత ఉందని, అలాగే సన్నబియ్యం అధిక మొత్తంలో అవసరముందని కలెక్టర్ వెంకటేశ్వర్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ దృష్టికి తీసుకెళ్లారు. గురువారం సాయంత్రం విజయవాడ నుంచి సీఎస్ వర్చువల్ విధానంలో స్వర్ణాంధ్ర, పీ4, ఎంఎస్‌ఎంఈ పార్కులు, అన్నదాత సుఖీభవ తదితర అంశాలపై జిల్లా అధికారులతో సమీక్షించారు. సీఎస్ మాట్లాడుతూ పీ4 అమలు, డాక్యుమెంట్ అప్‌లోడ్, శ్రీకాళహస్తీశ్వరాలయం, అర్బన్ పబ్లిక్ హెల్త్ సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు చేయాలన్నారు. పీ4 అమలు, డాక్యుమెంట్ అప్లోడ్ నాలుగు రోజుల్లో పూర్తి చేస్తామని కలెక్టర్ తెలిపారు. శ్రీకాళహస్తీశ్వరాలయం, అర్బన్ పబ్లిక్ హెల్త్ సెంటర్లను తనిఖీ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. డీఆర్వో నరసింహులు, సీపీవో వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, ఏపీఐఐసీ జోనల్ మేనేజరు భరత్‌రెడ్డి, డీఎంహెచ్‌వో పాల్గొన్నారు.

రేపు శ్రావణ పౌర్ణమి గరుడసేవ

తిరుమల, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): శ్రావణ పౌర్ణమి సందర్భంగా తిరుమలలో శనివారం గరుడసేవ నిర్వహించనున్నారు. శ్రీమలయప్పస్వామి గరుడునిపై కొలువుదీరి మాడవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమివ్వనున్నారు. సెప్టెంబరు 24 న మొదలయ్యే బ్రహ్మోత్సవాల్లో 28న గరుడసేవ ఉంటుంది. దీనికి ట్రయల్‌రన్‌గా శనివారం గరుడసేవను భావిస్తారు. లోటుపాట్లను గుర్తించి బ్రహ్మోత్సవాల్లో ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోనున్నారు.

గదిలో మరిచిపోయిన నగదు తిరిగి భక్తురాలికి అప్పగింత

తిరుమల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ఆదిత్య బిర్లా విశ్రాంతి గృహంలో మధు శాలిని అనే భక్తురాలు గురువారం గదిలో మరిచిపోయిన రూ.39 వేలు, 600 డాలర్లు, యాపిల్ స్మార్ట్ వాచ్, వాలెట్‌ను టీటీడీ సిబ్బంది తిరిగి అప్పగించారు. ఈ కార్యక్రమంలో పద్మావతి విచారణ కార్యాలయం సూపరింటెండెంట్ విజయ కుమార్, మేనేజర్ శ్రీనివాసులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రస్తుతం మంచి వాతావరణం :మంత్రి అనగాని

తిరుమల, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో మంచి వాతావరణం నెలకొందని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. గురువారం తిరుమల శ్రీవారి దర్శనం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గతంలో రాష్ట్రం నుంచి చాలా పరిశ్రమలను తరిమివేశారని, తిరిగి వారందరినీ రాష్ట్రానికి తీసుకువస్తున్నామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సురక్షితంగా వ్యాపారాలు చేసుకోవచ్చని తెలిపారు.

40 హోటళ్లు.. 36 శాంపిళ్లు

తిరుపతిలో ఆహార కల్తీ నిరోధక శాఖ దాడులు.. నాలుగు కేసులు



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని 40 హోటళ్లలో గురువారం ఆహార కల్తీ నిరోధక శాఖ దాడులు నిర్వహించింది. జాయింట్ ఫుడ్ కంట్రోలర్ పూర్ణచంద్రరావు నేతృత్వంలో రాష్ట్రంలోని 22 మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, తిరుపతి ఫుడ్ సేఫ్టీ అధికారి మద్దిలేటి జగదీష్, ఇతర అధికారులు బృందాలుగా విడిపోయి తనిఖీలు చేపట్టారు. కొన్ని కార్పొరేట్ స్థాయి హోటళ్లలో కల్తీ ఆహార పదార్థాలను గుర్తించారు. మరికొన్ని చోట్ల చెడిపోయిన కూరగాయలు, ఆకుకూరలు, మాంసం, రుచికోసం కలర్లు, కెమికల్స్, టేస్ట్ సాల్ట్ కలపడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ఇంట్లో అయితే ఇలానే తింటారా అంటూ తిరుచానూరు రోడ్డులోని ఓ హోటల్ యజమానిని ప్రశ్నించారు. ఊరూ పేరు లేని మసాలా దినుసులు వాడి యాత్రికులను అనారోగ్యం పాలు చేస్తారా అంటూ మరికొన్ని చోట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంకొన్ని హోటళ్లలో కిచెన్‌లు కంపు కొట్టడం, ఎలుకలు తిరగడంపై ఆగ్రహం చెందారు. వివిధ హోటళ్లలో నిల్వ వుంచిన దాదాపు 26 కిలోల ఆహార పదార్థాలను ధ్వంసం చేశారు. నాలుగు కేసులు నమోదు చేశారు. కొన్ని హోటళ్లలో తాగునీరు అపరిశుభ్రంగా ఉండటంపై తప్పు పట్టారు. తిరుపతిలోని దాదాపు 14 హోటళ్ళకు ఇంప్రూవ్‌మెంటు నోటీసులు జారీ చేశారు. దాదాపు 36 శ్యాంపుల్స్ తీసి ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపినట్లు జాయింట్ ఫుడ్ కమిషనరు పూర్ణచంద్రరావు ఆంధ్రజ్యోతికి చెప్పారు.

చేనేత వస్త్రం మన సంస్కృతికి ప్రతీక


పద్మావతి యూనివర్సిటీలో చేపట్టిన ర్యాలీలో పాల్గొన్న వీసీ ఉమ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చేనేత వస్త్రం భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అని పలువురు ప్రముఖులు అభిప్రాయపడ్డారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని నగరంలో పలుచోట్ల నిర్వహించారు. పద్మావతి మహిళా యూనివర్సిటీలో హ్యాండ్లూమ్ పవర్ వాక్ చేపట్టారు. ఇందులో వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని, విద్యార్థులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ చేనేత పరిశ్రమలు, కార్మికులను కాపాడుకోవాలన్నారు. చేనేత వస్త్రాల వాడకం ఆరోగ్యానికి మేలు చేస్తుందన్నారు. అనంతరం చేనేత వస్త్రాలను ధరిస్తామంటూ అందరూ ప్రతిజ్ఞ చేశారు.

చేనేత వస్త్ర ప్రదర్శన

పద్మావతి డిగ్రీ కాలేజీలో చేపట్టిన చేనేత వస్త్ర ప్రదర్శన ఆకట్టుకుంది. కాలేజీ ప్రిన్సిపాల్ నారాయణమ్మ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ స్వదేశీ చేనేత వస్త్రాలను వాడడం ద్వారా కార్మికులకు చేయూత అందించాలని కోరారు. వెంకటగిరి, పోచంపల్లె, గద్వాల, నారాయణవనం, శ్రీకాళహస్తి కలంకారి వస్త్రాలను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హోంసైన్స్ హెడ్ లక్ష్మి పాల్గొన్నారు.

టీటీడీని భ్రష్టుపట్టించింది మీరే కదా

● భూమనపై టీడీపీ నేతల ఆగ్రహం


మాట్లాడుతున్న ఆర్సీ మునికృష్ణ, రుద్రకోటి, సురేంద్ర నాయుడు

తిరుపతి, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి) : టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడిని విమర్శించే స్థాయి మాజీ ఎమ్మెల్యే కరుణాకరరెడ్డికి లేదని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ అన్నారు. గురువారం లీలామహల్ వద్దగల టీడీపీ కార్యాలయంలో నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, టీడీపీ పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఉట్ల సురేంద్రనాయుడితో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. భూమన టీటీడీ చైర్మన్‌గా చేసిన సందర్భంలో తిరుమల పవిత్రతను పూర్తిగా మంట కలిపారని విమర్శించారు. వెంకటేశ్వరస్వామికి అతి ఇష్టమైన లడ్డు ప్రసాదాన్ని కల్తీ నెయ్యితో చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. చైర్మన్‌గా పనిచేసిన వ్యక్తి దిగజారి మాట్లాడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వైసీపీ పాలనలో కప్పం కట్టే వారికి పెద్దపీట వేశారని, కూటమి ప్రభుత్వంలో అందరూ సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. తిరుమల భద్రత నిమిత్తం కొండపైన ఉన్న మఠాల యాజమాన్యాలకు నోటీసులు ఇచ్చామని, భద్రతా చర్యలు తీసుకోవాలని అందులో సూచించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విశ్వనాథం, శంకర్, శ్రీరాములు, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో రెండు సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలు


కోలుకున్న బాధితులతో డైరెక్టర్ ఆర్వీకుమార్

తిరుపతి(వైద్యం), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): గుండె, ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతున్న ఇద్దరు బాధితులకు అతిక్లిష్టమైన రెండు శస్త్ర చికిత్సలను స్విమ్స్‌లోని సీటీ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించినట్లు డైరెక్టర్ ఆర్వీకుమార్ తెలిపారు. శస్త్ర చికిత్సల అనంతరం కోలుకున్న బాధితులను ఆయన గురువారం డిశ్చార్జి చేశారు. ఈ సందర్భంగా ఆయన చెప్పిన వివరాల మేరకు.. కడప జిల్లా బద్వేలు మండలం బాలయ్యపల్లికి చెందిన సుంకర రత్నం(26) ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతూ స్విమ్స్‌కు వచ్చాడు. వైద్యులు పరీక్షించి గుండెలో గడ్డ పెరిగి ఊపిరితిత్తుల రక్తనాళాలు పూర్తిగా మూసుకుపోవడాన్ని గుర్తించి అతిక్లిష్టమైన శస్త్ర చికిత్స చేసి ఆ గడ్డను తొలగించి ఆయన ప్రాణాలు నిలబెట్టారు. అలాగే అన్నమయ్య జిల్లా కొల్లబైలు గ్రామానికి చెందిన ముడివేడు సోమశేఖర్(50) గుండె సమస్యతో బాధపడుతూ స్విమ్స్‌కు వచ్చాడు. వైద్యులు పరీక్షించగా నాలుగు కవాటాలు పూర్తిగా పాడైపోయినట్లు గుర్తించారు. రెండు కవాటాలు మార్చి, మరో రెండు కవాటాలకు చికిత్స చేసి అతిక్లిష్టమైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించి రోగిని రక్షించారు. ప్రస్తుతం సోమశేఖర్ కోలుకోవడంతో ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు. శస్త్ర చికిత్సలను డైరెక్టర్ ఆర్వీకుమార్ వైద్యాధికారులు సత్యవతి, అలోక్‌సమంత్రేలు వారి బృందంతో కలిసి నిర్వహించారు. బాధితులు, వారి కుటుంబ సభ్యులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

భూమన హయాంలో టీటీడీలో ఎన్నో అక్రమాలు

● ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు

తిరుపతి అర్బన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): భూమన కరుణాకరరెడ్డి చైర్మన్‌గా ఉన్నప్పుడు టీటీడీలో ఎన్నో అపచారాలు, అక్రమాలు జరిగాయని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు విమర్శించారు. గురువారం సాయంత్రం తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ భూమన హయాంలో శ్రీవారి దర్శన టిక్కెట్లు అక్రమంగా విక్రయించారని ఆరోపించారు. కల్తీనెయ్యితో లడ్డూలను, అన్నప్రసాదాలు తయారుచేసి అపచారం చేశారని ఆరోపించారు. టీటీడీ అక్రమ సంపాదనలో సగం జగన్‌కు పంపారని విమర్శించారు. భూమన కరుణాకరరెడ్డి, ఆయన కుమారుడు అభినయ్ పెద్ద దళారులని దుయ్యబట్టారు.

ఆయన మాటలను ప్రజలు నమ్మడం లేదని, త్వరలో జైలుకెళ్లడం తథ్యమని జోస్యం చెప్పారు. ధర్మారెడ్డి తిరుమలలో సర్వం తానై వ్యవహరించారని గుర్తు చేశారు. బీ.ఆర్.నాయుడు టీటీడీలో ఎన్నో మార్పులు తెచ్చారని, మంచి వ్యక్తిని టీటీడీ చైర్మన్‌గా నియమించిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టీటీడీలో ఎలాంటి అపచారాలూ జరగలేదని స్పష్టం చేశారు. సామాన్య భక్తులకు త్వరితగతిన స్వామి దర్శనం లభిస్తోందన్నారు.

ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు

●రూ.ఆరు లక్షల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ గురువారం ఎర్రచందనం రాష్ట్ర కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు చెప్పారు. మూడేళ్ల క్రితం రామచంద్రాపురం బీటు పరిధిలో తిరుపతికి చెందిన షణ్ముగం శేషాచలం అడవి నుంచి ఎర్రచందనం దుంగలు అక్రమ రవాణా చేస్తూ పట్టుబడ్డాడు. దీనిపై అప్పట్లో కేసు నమోదు చేశారు. మూడేళ్ల పాటు విచారించిన న్యాయమూర్తి ఇరువర్గాల వాదనలు విన్న తర్వాత సాక్ష్యాదారాలు రుజువు కావడంతో నిందితుడు షణ్ముగంకు ఈ మేరకు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

ఆగని భూమన అనుచరుల ఆగడాలు : జనసేన

తిరుపతి అర్బన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అనుచరుల ఆగడాలు ఆగడం లేదని జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దళితుడైన పవన్‌ను దారుణంగా కొట్టి, ఆ వీడియోలను తల్లిదండ్రులకు పంపించి రూ.5లక్షలు డిమాండ్ చేయడం దుర్మార్గమన్నారు. డబ్బు ఇవ్వకుంటే చంపేస్తామని బెదిరించడం దారుణమన్నారు. ఇకపై భూమన అనుచరుల ఆగడాలు సాగనివ్వమన్నారు. పవన్‌ను కొట్టిన వారిలో జనసేన పార్టీకి చెందిన దినేష్ ఉన్నారని వైసీపీ తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. దినేష్‌కు, జనసేన పార్టీకి ఎలాంటి సంబంధమూ లేదని స్పష్టం చేశారు. అనిల్‌రెడ్డి, దినేష్, జగ్గారెడ్డి స్నేహితులని, వీరు భూమన అనుచరులేనని అన్నారు. దినేష్ పాకాలలో రౌడీ షీటర్ అని తెలిపారు. బాధితుడు పవన్‌కు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

13న ఖాళీ ప్లాస్టిక్ టిన్‌ల ఈ-వేలం

తిరుమల, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాల్లో జీడిపప్పు ప్యాకింగ్‌కు వినియోగించిన ఖాళీ ప్లాస్టిక్‌డబ్బాలను టీటీడీ ఈ-వేలం వేయనుంది. ఈనెల 13న రాష్ట్ర ప్రభుత్వ కొనుగోలు పోర్టల్ ద్వారా ఈ-వేలం నిర్వహిస్తారు. వివరాలకు 0877 2264429 నెంబరుకు ఫోన్ చేయచ్చని టీటీడీ గురువారం ఓ ప్రకటన ద్వారా తెలిపింది.

భద్రతా ప్రమాణాలు ఉండేలా చర్యలు

● రైల్వేస్టేషన్ నూతన భవనాన్ని పరిశీలించిన దక్షిణ మధ్య రైల్వే ఇన్‌స్పెక్టర్ జనరల్


రైల్వేస్టేషన్‌లో కొత్త భవనాన్ని పరిశీలిస్తున్న అరోమాసింగ్ ఠాకూర్

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వేస్టేషన్‌లో నిర్మిస్తున్న నూతన భవనంలో భద్రత ప్రమాణాలు ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే ఇన్‌స్పెక్టర్ జనరల్, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రిన్స్‌పల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమాసింగ్ ఠాకూర్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె స్టేషన్ దక్షిణం వైపు నిర్మిస్తున్న నూతన భవనాన్ని పరిశీలించారు. ప్రయాణికుల భద్రతకు భంగం కలగకుండా ఆధునిక సాంకేతికతతో ఏర్పాటు చేస్తున్న సీసీటీవీ పర్యవేక్షణ వ్యవస్థ, లగేజ్ స్కానర్లు, మెటల్ డిటెక్టర్లు, భద్రతా అంశాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రేణిగుంట, తిరుపతి ప్రభుత్వ, రైల్వే పోలీసు అధికారులతో సమీక్ష చేశారు. రైళ్లలో మహిళలపై జరుగుతున్న దాడులు, చోరీలు, ఇతర నేరాలను నియంత్రించాలన్నారు.

రైలుపెట్టె అగ్ని ప్రమాదానికి సంబంధించిన కేసు ఎంతవరకు వచ్చిందని ఆరా తీశారు. ఈ సమావేశంలో అధికారులు ఆకాష్ కుమార్ జైస్వాల్, రాజగోపాల్ రెడ్డి, ఎం.సందీప్‌కుమార్, వెంకటేశ్వర్లు, ఇంజనీరింగ్ శాఖ అధికారులు వామనమూర్తి, మాధవరావు, నిర్మాణాల విభాగం ఇన్‌చార్జ్ నిర్మల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




మార్కెట్‌కు వరలక్ష్మీ కళ




వరలక్ష్మి వ్రతం.. మహిళలంతా ఆసక్తిగా ఎదురుచూసే ఆధ్యాత్మిక వేడుక.. శ్రావణమాసంలో పౌర్ణమి ముందు రోజు వచ్చే శుక్రవారం ఈ పూజ చేస్తారు. ఈ క్రమంలోనే గురువారం నగరంలోని మార్కెట్లన్నీ సందడిగా మారాయి. పత్రాలు, పుష్పాలు, ఫలాల కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

మండల్‌కు ఘన నివాళి



నివాళి అర్పిస్తున్న బీసీ నాయకులు

తిరుపతి అర్బన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బీపీ మండల్ డే (బిందేశ్వరీప్రసాద్)ను పురస్కరించుకుని గురువారం స్థానిక డీబీఆర్ రోడ్డు కూడలిలో ఉన్న ఆయన విగ్రహానికి గజమాలను అలంకరించి, ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు వంకీపురం పవన్, గోపాల్, కేశవులు, దేవరాజులు, శివ, గుణశేఖర్, భానుప్రకాష్, వెంకటేష్, శ్రీనివాసులు, మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సెలూన్ షాపులకు ఉచిత విద్యుత్‌పై హర్షం

తిరుపతి(ఎంఆర్‌పల్లి), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): సెలూన్ షాపులకు 200 యూనిట్ల వరకు ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను ప్రకటించడం పట్ల జనసేన నాయీబ్రాహ్మణ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అవులపాటి బుజ్జిబాబు హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చినందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు నాయీబ్రాహ్మణులు రుణపడి ఉంటారని తెలిపారు. అలాగే ఆలయ పాలకమండళ్లలోనూ అవకాశం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో నాగరాజు, శ్రీనివాసులు, సురేష్, రెడ్డయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక వాతావరణంలో చవితి వేడుకలు



మాట్లాడుతున్న సామంచి శ్రీనివాస్

తిరుపతి(జీవకోన), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను ఆధ్యాత్మిక వాతావరణంలో జరుపుకుందామని వినాయక మహోత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్ అన్నారు. గురువారం ఓ హోటల్లో ఏర్పాటు చేసిన కమిటీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండప నిర్వాహకులు, వలంటీర్లు పోలీసులతో సహకరిస్తూ ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూడాలన్నారు. వినాయకసాగర్ వద్ద మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, గొల్లపల్లి చెరువు వద్ద కూడా నిమజ్జనం జరిగేలా ఏర్పాట్లు చేయించేందుకు కలెక్టర్‌ను కోరినట్లు చెప్పారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, కమిటీ సభ్యులు ఊకా విజయకుమార్, కరాటే శ్రీనివాస్, ఎస్వీఎం వెంకటేష్, గుండాల గోపినాథ్, నవీన్, ఆకుల సతీష్, భాస్కర్‌నాయుడు, వాసు, గోపి ప్రసాద్, వేణుగోపాల్‌నాయుడు, రెడ్డిబాబు, కీర్తి వెంకయ్య, బాల, భరత్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీలో పదోన్నతులు ఎందుకు ఆపేశారు?

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): టీటీడీలో ఐదేళ్లుగా పదోన్నతులు ఎందుకు ఆపేశారో చెప్పాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. టీటీడీలో ఎస్సీ, ఎస్టీ రోస్టర్ పాయింట్‌లో ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సుదీర్ఘకాలంగా ఉద్యోగులకు పదోన్నతులు నిలిపివేయడం ధర్మమా అని ప్రశ్నించారు. ధర్మాన్ని ఆచరించే సంస్థలో ఇలా జరగడం సమంజసం కాదని విమర్శించారు. పదోన్నతులకు అర్హత ఉన్న 100 మందికిపైగా ఉద్యోగ విరమణ చేశారని, మరో 100 మంది కారుణ్య నియామకాల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. వెంటనే పదోన్నతులు కల్పించి, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

బీఎంఎస్‌ను స్విమ్స్‌లో ఉండకూడదనడం బాధాకరం

తిరుపతి (ఎమ్మార్‌పల్లె), ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో బీఎంఎస్ ఉండకూడదని సీఐటీయూ రాష్ట్ర నేత నరసింహారావు అనడం బాధాకరమని బీఎంస్ వర్కింగ్ ప్రెసిడెంట్ హేమరాణి అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆమె మాట్లాడుతూ కార్మికుల కోసం నిరంతరం పనిచేస్తున్న సంస్థ బీఎంఎస్ అన్నారు. కార్మికుల సమస్యలపై పోరాడుతున్నామని తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్లను పర్మినెంట్ చేస్తామని సీఐటీయూ నాయకులు 20ఏళ్లుగా వారిని మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ నేతలు వెంకటాద్రి యాదవ్, స్వర్ణలత, పవన్ సింగ్ పాల్గొన్నారు.

అరాచకాన్ని ప్రశ్నిస్తే ఫిర్యాదా?

నరసింహయాదవ్



మీడియాతో మాట్లాడుతున్న నరసింహయాదవ్

తిరుపతి, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి) : ఓ దళిత యువకుడిని దారుణంగా హింసించిన వైసీపీ నాయకుల అరాచకాలను సోషల్ మీడియా ద్వారా తెలియజేసిన టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్‌పైనే వైసీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేయడమేంటో అర్థం కావడంలేదని యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్ అన్నారు. గురువారం పార్లమెంటు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పోలీసులు వాడే లాఠీతో అతి దారుణంగా యువకుడిని హింసించడం యావత్తు ప్రజానీకం చూస్తున్నారన్నారు. తిరుపతిలో ఇలాంటి ఘటనలు బాధాకరమన్నారు. దళిత యువకుడిని కొట్టిన వీడియోను మహేష్‌యాదవ్ బయటపెట్టారని, అతనిపై చర్యలు తీసుకోవాలని వైసీపీ నేతలు ఫిర్యాదు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తిరుపతిలో భూమన కుటుంబం అలజడులు సృష్టిస్తోందని, పోలీస్‌స్టేషన్లలో సెటిల్మెంట్లు చేస్తోందని ఆరోపించారు. టీటీడీ ఛైర్మన్ బి.ఆర్.నాయుడిపై భూమన వ్యాఖ్యలను ఖండించారు. టీటీడీలో భూమన చేసిన అవినీతి, అక్రమాలపై విచారణ జరిపిస్తామన్నారు.

12న బీజేపీ సారథ్య సభను విజయవంతం చేయండి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఈనెల 12న చేపట్టనున్న సారథ్య సభను జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వరప్రసాద్ కోరారు. ఈ మేరకు 24వ డివిజన్ ఇందిరానగర్‌లో గురువారం ఆయన బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ హాజరవుతారని తెలిపారు. ఉదయం 9 గంటలకు లీలామహల్ సర్కిల్‌లోని శ్రీకృష్ణదేవరాయల విగ్రహం నుంచి కచ్చపి ఆడిటోరియం వరకు ర్యాలీ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మీడియా ఇన్‌చార్జి భాస్కర్, ఉపాధ్యక్షులు శేఖర్, మండలాధ్యక్షుడు శ్రీధర్, జిల్లా కార్యవర్గ సభ్యులు మంజుయాదవ్, అసెంబ్లీ కో కన్వీనర్ నాదమునిరెడ్డి పాల్గొన్నారు.

ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అక్రమాలపై విచారణ చేపట్టండి



రిజిస్ట్రార్ భూపతి నాయుడికి విన్నవిస్తున్న ఎన్ఎస్‌యూఐ నేత మల్లికార్జున

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ డిమాండ్ చేసింది. ఈ విషయమై యూనివర్సిటీ రిజిస్ట్రార్ భూపతి నాయుడికి ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున, నేషనల్ లా విద్యార్థి సంఘం అధ్యక్షుడు సుందర్రాజు గురువారం వినతిపత్రం అందజేశారు. మల్లికార్జున మాట్లాడుతూ ఉద్యోగం వచ్చిన ప్రతి విద్యార్థి నుంచీ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మూడువేల నుంచి పదివేల రూపాయల వరకు అక్రమంగా వసూలు చేశారని ఆరోపించారు. ఐదేళ్లుగా ఈ వ్యవహారం నడిచిందని తెలిపారు. ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి విచారణ చేపట్టాలని కోరారు. ఆయన వసూలు చేసిన డబ్బును యూనివర్సిటీ అకౌంట్లోకి జమ చేయాలని, లేకపోతే విద్యార్థులతో కలిసి ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముఖేష్, కుమార్ పాల్గొన్నారు.

10న భగవద్గీత పారాయణం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): శ్రీఅన్నమయ్య డ్యాన్స్ అకాడమీ, అపస్మా ఆధ్వర్యంలో కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఆదివారం తిరుపతి రఘునాథాచార్య ఓపెన్ ఆడిటోరియంలో భగవద్గీత పారాయణం, నృత్యగాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో పోస్టర్లు ఆవిష్కరించారు. ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం వరకు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

లక్ష్మీపురంలో సమస్యలు పరిష్కరించండి



కమిషనర్ మౌర్యకు వినతిపత్రం అందజేస్తున్న బాలసుబ్రమణ్యం

తిరుపతి, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి) : తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా లక్ష్మీపురంలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించాలని టీడీపీ నేత డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం కోరారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ మౌర్యను కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. 2వ డివిజన్‌లో రోడ్లు దెబ్బతిన్నాయని చెప్పారు. దీనిపై స్పందించిన కమిషనర్ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుల్లెట్ రమణ, కృష్ణ యాదవ్, పుష్పావతి యాదవ్, పెరుమాళ్ మధు ఉన్నారు.

ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌పై దాడి హేయం



తిరుపతి (జీవకోన), ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ బీసీ సెల్ నేత, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడి హేయమైన చర్య అని మేయర్ డాక్టర్ శిరీష అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద వైసీపీ బీసీ విభాగం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వైసీపీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, బీసీ నేతలు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి-వెంకటగిరి మార్గంలో ప్రయాణం.. నరకప్రాయం

ఐఐటీ, ఐసర్ రాకతో పెరిగిన రద్దీ

ఉన్న సర్వీసులు సరిపోక ప్రయాణికుల అవస్థలు



వెంకటగిరి బస్సు ఎక్కేందుకు పోటీపడుతున్న ప్రయాణికులు

తిరుపతి (ఆర్టీసీ), ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి-వెంకటగిరి మార్గంలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేయాలంటే నరకం కనిపిస్తోంది. ఇటీవల రద్దీ విపరీతంగా పెరగడం, ఉన్న సర్వీసులు సరిపోకపోవడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ మార్గంలో 6పల్లె వెలుగు, 6ఎక్స్‌ప్రెస్‌లు అందుబాటులో ఉన్నాయి. లాంగ్‌రూట్ ఎక్స్‌ప్రెస్ బస్సులు 2, సూపర్‌లగ్జరీ 4 బస్సులు నడుస్తున్నాయి. ఉదయం 6 నుంచి రాత్రి 8.30గంటల వరకు బస్సులు అందుబాటులో ఉంటాయి. సాధారణంగానే ఈ బస్సుల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. దాదాపు అన్ని సర్వీసుల్లో స్టాండింగ్ వస్తుంది. ఇటీవల కాలంలో ఏర్పేడు వద్ద సెంట్రల్ విద్యాసంస్థలు ఐసర్, ఐఐటీ వచ్చాయి. అందులో పనిచేసే ఉద్యోగులు, చదువుకునే విద్యార్థులు తిరుపతిలోనే ఉంటున్నారు. వారు ప్రతిరోజూ ఈ బస్సుల్లోనే రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ఉదయం, సాయంత్రం రద్దీ మరింత పెరిగింది. దీంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. బస్సు వచ్చిందంటే సీటు కోసం పోటీపడే పరిస్థితి కనిపిస్తోంది. వృద్ధులు, చంటి పిల్లల తల్లులు ఇబ్బంది పడుతున్నారు. సర్వీసులు పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయమై డీపీటీవో జగదీష్‌ను వివరణ కోరగా విజయవాడ ప్రధాన కార్యాలయానికి ప్రతిపాదనలు పంపి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కాగా, రిక్వెస్టు స్టాపింగ్ వద్ద బస్సులు ఆపడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిపైనా దృష్టి సారిస్తామని తెలిపారు.

వైసీపీ గూండాల రాక్షసత్వానికి పవన్‌పై దాడే నిదర్శనం : బీజేపీ

తిరుపతి(విద్య),ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని వైసీపీ గూండాలు దళిత యువకుడు పవన్‌ని విక్షణారహితంగా దాడిచేసి రాక్షసత్వాన్ని చాటుకున్నారని టీటీడీ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర అధికారప్రతినిధి జి.భానుప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల వైసీపీ నాయకుడు చైతన్య చేసిన దౌర్జన్యం మరువకముందే.. నేడు అనిల్‌కుమార్ రెడ్డి, భూమన అనుచరులు బరితెగించి ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేస్తూ రాక్షసానందం పొందడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. దీనిపై ఎస్పీ హర్షవర్ధన్‌రాజుతో మాట్లాడామని, దాడికి పాల్పడిన వారిపై రౌడీషీటర్ నమోదు చేసి ఆధ్యాత్మిక రాజధాని తిరుపతిలో ప్రశాంతత నెలకొల్పాలని కోరామన్నారు. నిత్యం నీతులు వల్లించే భూమన..ముందుగా తన కార్యకర్తలను అదుపులోపెట్టుకోలేక ప్రజలపై ఉసిగొల్పి వారి ప్రాణాలకే ముప్పు కలిగించడం దారుణమన్నారు.

నామమాత్రపు అద్దెతో స్విమ్స్‌లో 17 అంబులెన్సులు

పి-4 స్ఫూర్తితో ముందుకొచ్చిన శ్రీబాలాజీ అంబులెన్సు సర్వీస్ సొసైటీ



తిరుపతి(వైద్యం), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పీ-4 (పేద కుటుంబాలకు సంపన్న కుటుంబాలు సాయం చేయడం) విధానాన్ని స్ఫూర్తిగా తీసుకొని స్విమ్స్‌లో రోగుల కోసం నామమాత్రపు అద్దెతో 17 అంబులెన్సులను అందుబాటులోకి తీసుకొచ్చారు. శ్రీబాలాజీ అంబులెన్సు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ సదుపాయం కల్పిస్తున్నట్లు ఆ సొసైటీ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఈ 17 అంబులెన్సులను ఆయన గురువారం జెండా ఊపి ప్రారంభించారు. అర్హులైన రోగులు అంబులెన్సుకు సరిపడ పెట్రోలుకు నగదు, డ్రైవరు బత్తా మాత్రమే చెల్లించి ఈ అంబులెన్సుల సర్వీసును పొందవచ్చన్నారు. మహా ప్రస్థానం బాధితులు భరించేలా ఈ సర్వీసును పూర్తి ఉచితంగా అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. దీనికి 17 మంది ఓనర్లు, డ్రైవర్లు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ ఈ కార్యక్రమంలో టీడీపీ అధికార ప్రతినిధి సుర సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు బుల్లెట్ రమణ, పుష్పావతి, నేతలు కృష్ణ యాదవ్, మధుబాబు, శ్రీబాలాజీ అంబులెన్సు సర్వీస్ సొసైటీ సలహాదారు రామచంద్రయాదవ్, మోహనాచారి, రమేష్, చందు పాల్గొన్నారు.

కె.శ్రీనివాస్‌కు నేడు

కేఎన్ జయమ్మ స్ఫూర్తి పురస్కారం



ఆంధ్రజ్యోతి మాజీ సంపాదకులు, ఉపన్యాసకులు, సామాజిక సాహిత్య విశ్లేషకులు డాక్టర్ కె.శ్రీనివాస్‌కు కేఎన్ జయమ్మ స్ఫూర్తి పురస్కారాన్ని నేడు ప్రదానం చేయనున్నట్లు రచయిత పలమనేరు బాలాజి ఓ ప్రకటనలో తెలిపారు. పలమనేరు సమీపం మదనపల్లె రహదారిలోని లయన్స్‌క్లబ్ వేదికగా శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఆయనకు జ్ఞాపికతో పాటు రూ.25వేలను అందజేయడం జరుగుతుందన్నారు. జర్నలిస్టుగా నాలుగు దశాబ్దాలకు పైగా కె.శ్రీనివాస్ రాసిన కథనాలు, సంపాదకీయాలు, చేసిన ఇంటర్వ్యూలు, సమకాలీన ప్రపంచ చరిత్రను కొత్తకోణంలో చూపిస్తాయన్నారు. తెల్లారని తెలంగాణ, బుల్డోజర్ సందర్భాలు, శ్రీనివాస్ సంపాదకీయాలు, తెలంగాణలో సాహిత్య వికాసం, జూన్ 2, అనేక సందర్భాలు, కొత్త వంతెన, సంభాషణ.... ఇలా తెలుగు ప్రపంచానికి అవసరమైన అన్ని సందర్భాలలో విలువైన ఎన్నో పుస్తకాలను ఆయన వెలువరించారన్నారు.తాపీ ధర్మారావు స్మారక పురస్కారం, సి.వై. చింతామణి అవార్డు, ఎన్.ఆర్. చందూర్ అవార్డు, డి. శ్రీపాదరావు అవార్డు, మాదల వీరభద్రరావు స్మారక పురస్కారం, దేవులపల్లి రామానుజ రావు స్మారక సాహిత్య పురస్కారం,ముప్వా పద్మావతి రంగయ్య పురస్కారం,అరుణ్ సాగర్ విశిష్ట పాత్రికేయ పురస్కారం, ప్రపంచ తెలుగు సమాఖ్య వారి బీఎస్ఆర్ కృష్ణ స్మారక పురస్కారం-2016.. మొదలైన పురస్కారా లను తన రచనలకు కె. శ్రీనివాస్ ఇదివరకు పొందారని ఆయన వివరించారు.

- గంగవరం, ఆంధ్రజ్యోతి


సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో ఓ షెడ్డులో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.4.15 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 71,144

తలనీలాలు సమర్పించినవారు: 28,889



ఒంపులు తిరుగుతూ సాగే ఏరు.. నిశ్చలంగా నీళ్లు.. ఏటికి అటూఇటూ ఒత్తుగా పెరిగిన మడచెట్లు.. వాలుతూ ఎగురుతూ పక్షులు.. ఏటినీటిలో పడవలు.. వలలు విసురుతూ మత్స్యకారులు.. కేరళ తరహా అందమైన దృశ్యం తిరుపతి జిల్లా చిల్లకూరు మండలంలో కనిపిస్తుంది. కండలేరు క్రీక్‌గా పిలిచే ఈ ఉప్పుటేరు జీవ వైవిధ్యానికి, మత్స్యకారుల జీవనోపాధికి నెలవు. పర్యాటకులకు కనువిందు. కాకపోతే అందుకు తగిన ఏర్పాట్లను ప్రభుత్వం ఈ ప్రాంతంలో చేయాల్సి ఉంది.

- గూడూరు, ఆంధ్రజ్యోతి

మన సుందర్బన్ ఈ ఉప్పుటేరు





ఉప్పుటేరులో గిరిజనుల చేపల వేట



కండలేరు ఏరియల్ వ్యూ



వేటకోసం పడవలు

36 కిలోమీటర్లు విస్తరించిన కండలేరు క్రీక్

గుమ్మళదిబ్బ సముద్ర ముఖద్వారం నుంచి తిప్పగుంటపాళెం వరకు 36 కిలోమీటర్ల వెనుకకు సముద్రపు ఉప్పునీరు ప్రవహిస్తుంది. అదే సమయంలో వెంకటగిరి కైవల్యానది నుంచి వచ్చే మంచినీటి ప్రవాహం గూడూరు మీదుగా చల్లకాలువ, పంబలేరుకు చేరుతుంది. గూడూరు మండలంలోని మిట్టాత్మకూరు ప్రాంతాల నుంచీ, రాపూరు కండలేరు జలాశయం నుంచీ వచ్చే జలాలు పంబలేరువాగుకు చేరుకుంటాయి. ఇవి మనుబోలు మండలం వెంకన్నపాళెం గ్రామం గుండా ప్రవహిస్తాయి. వీటికి మనుబోలు మీదుగా వచ్చే వరదనీరు కూడా జత అయ్యి చిల్లకూరు మండలం తిప్పగుంటపాళెం వద్ద ఉన్న కండలేరుక్రీక్‌లో కలుస్తాయి. ఇక్కడ ఒక చెక్‌డ్యాంను నిర్మించారు. ఈ చెక్‌డ్యాం వరకు అటు ఉప్పునీరు (బ్యాక్‌వాటర్) వస్తుంది. ఇటు మంచినీరు ఈ చెక్‌డ్యామ్‌ను దాటుకుని కండలేరు క్రీక్‌లోకి ప్రవహిస్తోంది. ఈ క్రీక్ ద్వారా గుమ్మళ్లదిబ్బ ప్రాంతంలోని సముద్రంలో జలాలు కలుస్తాయి. దీంతో కండలేరు క్రీక్ ఉప్పుటేరుగా ప్రసిద్ధి చెందింది.

ఉప్పుటేరు ప్రత్యేకత ఇదీ..

కండలేరు ఉప్పుటేరు ప్రత్యేకత ఏమిటంటే ఇటు మంచి నీరూ, అటు ఉప్పునీరూ కలవడం. సముద్రంలో లాగా లవణశాతం ఎక్కువ ఉండదు. మధ్యస్తంగా 10 పీపీటీ నుంచి 30 పీపీటీ లోపు మాత్రమే ఈ ఏటిలో ఉంటుంది. దీంతో చేపలు, రొయ్యలు, పీతలు సమృద్ధిగా పెరుగుతాయి. ఈ జలాలు మడ అడవుల పెరుగుదలకు దోహదపడుతాయి. అందుకే ఉప్పుటేరు వెంబడి మడ అడవులు విస్తరించి ఉంటాయి. ఇవి తీరప్రాంతాల కోతను నిలువరిస్తుంటాయి. చేపలు, రొయ్యలు వదిలే లార్వాలు(గుడ్లు) నీటి ప్రవాహంలో కొట్టుకు పోకుండా మడ చెట్లకు చుట్టుకుని ఉంటాయి. అక్కడే పిగిలి, చేపలు, రొయ్యల వృద్ధికి దోహదపడతాయి. ఈ తరహా ముఖద్వారాలు మన దేశంలోని సుందర్బన్ (పశ్చిమ బెంగాల్), గోదావరి (ఆంధ్రప్రదేశ్), కావేరి (తమిళనాడు), మండోవి (గోవా) ప్రాంతాలలో ఉన్నాయి.

అపార మత్స్య సంపద

ఈ క్రీక్‌వెంబడి తిప్పగుంటపాళెం, చేడిమాల, బెస్తపాళెం, అంకులపాటూరు, రామారెడ్డిపాళెం, ఏరూరు, మోమిడి, వరగలి, లింగవరం, తమ్మినపట్నం, గుమ్మళ్లదిబ్బ గ్రామాలున్నాయి. ఈ ప్రాంతంలోని మత్స్యకారులు పడవల్లో ఈ క్రీక్ ద్వారానే గుమ్మళదిబ్బ సమీపంలోని సముద్రంలోకి వేటకు వెళుతుంటారు. తీర గ్రామాల్లోని గిరిజనులు మాత్రం ఉప్పుటేరులోనే చేపలు, రొయ్యలను పట్టుకుని జీవనోపాధి పొందుతున్నారు. ఉప్పుటేరులో రొయ్యలు, పీతలతో పాటు కోడివాయ, వంజరం, చందువ రకం చేపలు దొరుకుతుంటాయి. దీంతోపాటూ క్రీక్ వెంబడి సుమారు రెండు వేల ఎకరాలకు పైగా రొయ్యల చెరువులు ఏర్పడ్డాయి. ఇక్కడ పెరిగే రొయ్యలను అంతర్జాతీయ మార్కెట్‌కు ఎగుమతి చేస్తుంటారు.



మడ అడవులు



ఉప్పుటేరు వెంబడి సాగవుతున్న రొయ్యల చెరువులు



తిప్పగుంటపాళెం చెక్‌డ్యాం



కండలేరు ఉప్పుటేరు


రెండు ద్విచక్ర వాహనాల ఢీ

ముగ్గురికి తీవ్రగాయాలు



కేవీబీపురం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మఠం గ్రామం వద్ద గురువారం రాత్రి 9 గంటల సమయంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ఒక వ్యక్తి నిండ్ర మండలం కావనూరుకు చెందిన వారుగా తెలిసింది. మరో ఇద్దరి వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు 108లో శ్రీకాళహస్తిలోని ఆస్పత్రికి తరలించారు ఎస్‌ఐ, పోలీసులు వెళ్లే సరికే అక్కడి ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని అంటున్నారు. పోలీసులు మాత్రం సంఘటనస్థలంలో ప్రమాదానికి గురైన ద్విచక్ర వాహనాలను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్, ఏఎస్‌ఐ ఇమాన్యుయేల్ తెలిపారు.

చేనేతకు ప్రభుత్వం చేయూత



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

వెంకటగిరి టౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. వెంకటగిరిలోని పద్మశాలి కల్యాణ మండపంలో గురువారం జరిగిన జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. జిల్లాలో నేటి నుంచి చేనేత కార్మికులకు 200 యూనిట్లు, పవర్ లూం కార్మికులకు 500 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా ఇస్తోందన్నారు. జిల్లాలో దాదాపు 29 ప్రాథమిక చేనేత సహకార సంఘాలుండగా వెంకటగిరిలోనే ఏడు సంఘాలు చురుగ్గా పనిచేస్తున్నాయన్నారు. 42వేల మందికి చేనేత కార్మికులకు రూ. 41లక్షల మేర రుణాలు మంజూరు చేశామన్నారు. జాతీయ స్థాయి ఎగ్జిబిషన్లలతో వెంకటగిరి చేనేత ఉత్పత్తులు తమదైన ముద్ర వేసుకుంటున్నాయన్నారు. ఈ ప్రాంతానికి చెందిన లక్కా శ్రీనివాసులు సంత్‌కబీర్ పురస్కారం అందుకోవడం గర్వకారణమన్నారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ చేనేతల సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చొరవ తీసుకుంటామన్నారు. అనంతరం రూ.60లక్షల మేర ముద్ర వీవర్స్ చెక్కును అందజేశారు. హ్యాండ్లూం ఏడీ రమేష్, ఎల్‌డీఎం గుంటూర్ రవికుమార్, రాష్ట్ర పద్మశాలి కార్పొరేష్ డైరెక్టర్ గంగాధర్, ఏఎంసీ చైర్మన్ విశ్వనాథం, లక్ష్మీపతి, సత్యనారాయణ, పులికల్లు రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కాగా చేనేత దినోత్సవం సందర్భంగా పట్టణంలోని క్రాస్ రోడ్డు వద్ద నిర్వహించిన ర్యాలీలో కలెక్టర్ వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

నేడు అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం

● ఏర్పాట్లు పూర్తి చేసిన టీటీడీ ● వ్రతానికి 500 టిక్కెట్ల జారీ







భక్తురాలికి వ్రతం టికెట్ అందజేస్తున్న డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్ - టిక్కెట్ల కోసం బారులు తీరిన భక్తులు - సిద్ధమైన ఆస్థాన మండపం

తిరుచానూరు. ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఉదయం10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు వైభవంగా వరలక్ష్మి వ్రతం నిర్వహించడానికి టీటీడీ అన్ని ఏర్పాట్లూ చేసింది. ఆస్థానమండపం వేదికగా జరిగే వ్రతానికి గంట ముందుగా టిక్కెట్లు పొందిన భక్తులను అనుమతించనున్నట్లు విజిలెన్సు అధికారులు తెలిపారు. ఆన్‌లైన్, కరెంటు బుకింగ్, సిఫార్సు లెటర్ల ద్వారా 500 టిక్కెట్లు విక్రయించనున్నారు. వ్రతంలో వెయ్యి మంది పాల్గొనే అవకాశం ఉంది. ఉదయం అమ్మవారికి వస్త్రాలంకరణ సేవ మినహా అన్ని ఆర్జిత సేవలను రద్దుచేసినట్లు టీటీడీ తెలియజేసింది. సర్వదర్శనంలోనే అమ్మవారిని దర్శించుకోవాల్సి ఉంటుంది. గేట్ నెంబరు 4(పాతపోలీస్‌స్టేషన్) నుంచి భక్తులను అనుమతించనున్నారు. ఇందుకోసం అక్కడ జర్మన్‌షెడ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేశారు. సాయంత్రం మాడవీధుల్లో పద్మావతి అమ్మవారు స్వర్ణరథంపై ఊరేగి భక్తులను కటాక్షించనున్నారు. ఈ సందర్భంగా ఆలయంతో పాటు మాడవీధులు, ఆస్థాన మండపాలన్ని సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలంకరణ చేశారు. గురువారం ఉదయం కుంకుమార్చన కౌంటర్‌లో 150 వ్రతం టిక్కెట్లను టీటీడీ అధికారులు విక్రయించారు. అరగంట వ్యవధిలోనే టిక్కెట్లు అయిపోయాయి. టిక్కెట్లు దొరకని భక్తులు నిరాశగా వెనుదిరిగారు.

మహిళ కేంద్రబిందువుగా సంక్షేమ పథకాలు

● సత్యవేడు వైసీపీ నేతల చేరిక కార్యక్రమంలో మంత్రి అనగాని



తిరుపతి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళ కేంద్ర బిందువుగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. తిరుపతిలోని గ్రాండ్ రిడ్జ్ హోటల్లో గురువారం జరిగిన కార్యక్రమంలో సత్యవేడు నియోజకవర్గ టీడీపీ కో ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తాము ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలే కాకుండా ఎక్కువగా 12 హామీలు నెరవేర్చుతున్నామన్నారు. ఆగస్టు 15 నుంచీ మహిళలకు ఐదు రకాల ఆర్టీసీ బస్సు సర్వీసుల్లో రాష్ట్రమంతటా ఉచితంగా ప్రయాణించే సదుపాయం అందుబాటులోకి రానుందన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా స్వల్ప వ్యవధిలోనే సత్యవేడు టీడీపీ కోఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి నాయకత్వాన నియోజకవర్గంలో 70 వేల గడపలు తొక్కి ప్రజలను పలకరించడం ప్రశంసనీయమన్నారు. శంకర్‌రెడ్డిని, పార్టీని బలహీనపరిచే ప్రయత్నాలను సహించేది లేదని స్పష్టం చేశారు. చంద్రబాబు సుపరిపాలనతో ఆకర్షితులై ఇతర పార్టీలకు చెందిన వారంతా టీడీపీలోకి వస్తుండడం సంతోషం కలిగిస్తోందన్నారు. అంతకు ముందు టీడీపీలో చేరిన వైసీపీకి చెందిన సత్యవేడు జడ్పీటీసీ విజయలక్ష్మి, ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా వున్న ఆమె భర్త చంద్రశేఖర్ రెడ్డి, దాసుకుప్పం సర్పంచ్ రవిరెడ్డి, ఉప సర్పంచు ఉస్మాన్, సర్పంచులు గోవిందస్వామి (కాలమనాయుడుపేట), రూబన్ (పెద్ద ఈటిపాకం), సన్యాసయ్య (మల్లావారిపాలెం ఈస్ట్), కమల్ (ఆరూరు), శిరీష (ఏఎంపురం), వైసీపీ నేతగా వున్న ఆమె భర్త శ్రీనివాసులు, నియోజకవర్గ, మండల వైసీపీ సోషల్ మీడియా విభాగం అధ్యక్షులు శ్యామ్ కుమార్, రాజశేఖర్‌రెడ్డి తదితరులను మంత్రి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్, మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, కార్పొరేటర్ అన్నా అనిత, సత్యవేడు నియోజకవర్గ టీడీపీ కో ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే హేమలత, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్తా చాటిన 'కూరపాటి'

టీడీపీ కోఆర్డినేటర్‌గా నియమితులైన స్వల్ప వ్యవధిలోనే పెద్ద ఎత్తున వైసీపీ ప్రజాప్రతినిధులను టీడీపీలోకి చేర్చుకోవడం ద్వారా కూరపాటి శంకర్‌రెడ్డి సత్తా చాటుకున్నారు. గత నెల 2న ఆయన నాయకత్వాన్ని ప్రకటించగా, 6న మంత్రి అనగాని సత్యప్రసాద్ సత్యవేడు వెళ్ళి పార్టీ శ్రేణులకు పరిచయం చేశారు. నెల వ్యవధిలో ఆయన ఎమ్మెల్యే ఆదిమూలం నుంచీ అభ్యంతరాలను ఎదుర్కొంటూ మధ్యమధ్యన అధిష్ఠానాన్ని సంప్రదిస్తూనే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం కొనసాగిస్తూ వచ్చారు. సత్యవేడు మండలానికి చెందిన వైసీపీ జడ్పీటీసీ మొదలుకుని పలువురు సర్పంచులను టీడీపీలోకి తీసుకొచ్చారు. ఒక రకంగా మండలంలో వైసీపీ ఖాళీ అయినట్టుగా భావించాల్సి వస్తోంది. ఈ పరిణామం వైసీపీకి షాకిచ్చింది.

శ్రీకాళహస్తిలోనూ సర్వం సిద్ధం





బ్రహ్మగుడి ఆలయం వద్ద ఏర్పాట్లు - పసుపు, కుంకుమ తదితరాలను సిద్ధం చేస్తున్న ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాహస్తీశ్వరాలయ ప్రాంగణంలోని బ్రహ్మగుడి వద్ద శుక్రవారం వరలక్ష్మి వ్రతం నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వ్రతం జరగనుంది. వ్రతంలో పాల్గొనే మహిళలకు ఇచ్చే వాయినాలను అధికారులు, సిబ్బంది సిద్ధం చేస్తున్నారు.

తిరుపతిలో ఎస్టీ విద్యార్థులకు రీజనల్ స్టడీ సర్కిల్

తిరుపతి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలకు హాజరయ్యే గిరిజన విద్యార్థులకు శుభవార్త. వీరి కోసం ఏపీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో తిరుపతిలో రీజనల్ స్టడీ సర్కిల్ ఏర్పాటుకానుంది. ఇందుకు ప్రభుత్వం అనుమతించింది. గతేడాది ఆగస్టులో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు స్టడీ సర్కిల్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఈక్రమంలోనే విజయవాడతోపాటు తిరుపతిలో రీజనల్ సెంటర్ల ఏర్పాటుకు గురువారం ప్రభుత్వం గురువారంఉత్తర్వులు జారీ చేసింది. వీటి నిర్వహణకు రూ. 4.22 కోట్లు మంజూరు చేస్తూ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ముదావత్ .నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు.

కొయ్యబొమ్మల శిక్షణా శిబిరం

శ్రీకాళహస్తి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపేటలో గల కళాసృష్టి కార్యాలయంలో ఢిల్లీకి చెందిన చేనేత జౌళిశాఖ సహకారంతో రెండు నెలలపాటు కొయ్యబొమ్మల తయారీపై శిక్షణ ఇవ్వనున్నట్లు కళాసృష్టి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి డాక్టర్ గుమ్మడిపూడి దశరథాచారి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ శిక్షణకు కొయ్యబొమ్మల కళాకారులు మాత్రమే అర్హులని గుర్తుచేశారు. అభ్యర్థులకు చేనేత జౌళిశాఖ నుంచి గుర్తింపు పొందిన హస్తకళల కార్డు ఉండాలని తెలియజేశారు. 18 నుంచి 35 సంవత్సరాలలోపు వయసు కలిగి ఉండాలని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో జీతభత్యాలు అందజేస్తామని వివరించారు. చేనేత జౌళిశాఖ సర్టిఫికెట్లు ఇస్తారని వెల్లడించారు. ఆసక్తి గల కళాకారులు పట్టణంలోని కార్యాలయంలో దరఖాస్తులను పొందవచ్చని తెలియజేశారు.

టీచర్ అంకయ్య సస్పెన్షన్

తిరుపతి(విద్య),ఆగస్టు7(ఆంధ్రజ్యోతి):బాలాయపల్లెమండలం జయంపు ప్రాథమిక పాఠశాలలో సెకండరీగ్రేడ్ టీచర్ చిన్న అంకయ్య సస్పెండయ్యారు. రోజూ మద్యం తాగి విధులకు హాజరవుతుండడం.. 4,5తరగతుల విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని నిర్ధారణ కావడంతో సస్పెండ్ చేస్తున్నట్లు డీఈవో కేవీఎస్ కుమార్ గురువారం పేర్కొన్నారు. ఎంఈవో ప్రాథమిక విచారణ జరిపి నివేదించారన్నారు. ఈక్రమంలోనే చిన్న అంకయ్యను సస్పెండ్ చేశామని ఒక ప్రకటనలో వివరించారు.

పుత్తూరు వార్తలు

ప్రకృతికి హాని చేయరాదు: ఎమ్మెల్యే భాను

మూలకోనలో ఎకో టూరిజం ప్రారంభం



మొక్కనాటి ఎకో టూరిజాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రకృతి అందాలు కొలువుదీరిన మూల కోన ప్రాంతంలో కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజాన్ని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ గురువారం ప్రారంభించారు. మొక్కలు నాటి నీరు పోశారు. మూలకోన వాటర్ ఫాల్స్ సమీపంలో చెక్‌పోస్టును కూడా ప్రారంభించారు. పర్యాటకుల సంచారంతో ప్రకృతికి ఎటువంటి హాని కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు తావు లేకుండా కఠిన చర్యలు చేపట్టాలని అటవీ శాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్వో మాధవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హంస వాహనంపై ధర్మరాజు



పుత్తూరు టౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పుత్తూరులోని ద్రౌపదిదేవి సమేత ధర్మరాజుల స్వామి మహాభారత ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి హంస వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం సతీసమేతంగా స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య పూజా కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం హంస వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పుత్తూరు మున్సిపల్ మాజీ ఛైర్మన్ యుగంధర్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులకు సాల్వాకం కృష్ణప్ప మెదలి, సభ్యులు మునిచంద్ర, దామోదరం, కేశవ పాల్గొన్నారు.

రైతు హితుడు ఎంఎస్‌స్వామినాథన్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చంద్రమౌళి

పుత్తూరు, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): హరిత పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ కృషితోనే నేడు దేశంలో ఆహారం కొరత లేదని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అన్నారు. కళాశాలలో వృక్షశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో గురువారం ఎంఎస్‌స్వామినాధన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కోటేశ్వరరావు, సుజన, నరసింహులు, జయప్రద పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో అధ్యాపకుల నిరసన



పుత్తూరు, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులు తమ సమస్యల పరిష్కారం కోసం గురువారం నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నరసింహులు మాట్లాడుతూ బదిలీలు, పదోన్నతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళ విభాగం అధ్యక్షురాలు సుజన, జిల్లా కార్యదర్శి వెంకటకృష్ణయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

వడమాలపేట, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారామపురం గ్రామానికి చెందిన ఇద్దరు టీడీపీ నాయకుల కుటుంబాలకు టీడీపీ బీమా కింద రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించారు. సీతారామపురం గ్రామానికి చెందిన నాయకులు రాజేంద్ర, పార్థసారధినాయుడు (బాబు నాయుడు) ఫిబ్రవరి నెల 2వ తేదీ జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. వీరిద్దరూ పార్టీ సభ్యత్వం కలిగి ఉండడంతో రూ.5 లక్షల ఆర్థికసాయం బీమా కింద పార్టీ అందజేసింది. గురువారం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తిరుపతిలోని ఆయన నివాసంలో మృతుల కుటుంబ సభ్యులకు సంబంధిత చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవానందనాయుడు, మునినాదం, దేవరాజుల నాయుడు, హరిప్రసాద్, గోవర్ధన్‌లు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం



వడమాల వడ్డిపల్లిలో కరపత్రం అందిస్తున్న నాయకులు

వడమాలపేట,ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని ఆ పార్టీ చిత్తూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు తెలిపారు. 'సుపరిపాలనలో తొలిడుగు' కార్యక్రమంలో గురువారం మండలంలోని వడమాల వడ్డిపల్లి, కదిరిమంగళం గ్రామాల్లో ఇంటింటా కరపత్రాలు అందజేశారు. సంక్షేమ కార్యక్రమాలపై ఆరా తీసి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు దాముయాదవ్, కార్యదర్శి శివరాయల్, మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ పెద్దబ్బరాజు, నాయకులు హేమావతి, వేణునాదం, వెంకట్రామానాయుడు, బత్తినాయుడు, పూర్ణ, మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

వడమాలపేటలో వారపు సంత



వడమాలపేట,ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద వారపు సంత నిర్వహిస్తున్నారు. రోడ్డు పక్కన ప్రతి గురువారం వారపు సంత నిర్వహిస్తున్నారు. రెండో పర్యాయం గురువారం నిర్వహించిన సంతకు పరిసరాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కాగా వడమాలపేట నుంచి సంత నిర్వహించే ప్రాంతం కిలోమీటర్ దూరం ఉండడంతో ఇబ్బందులు పడుతున్నామని, అందరికీ అందుబాటులో ఉండేలా సంత నిర్వహించాలని పలువురు కోరుతున్నారు. సరైన వసతులు కల్పించాలని దుకాణదారులు కోరుతున్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

అదుపుతప్పిన కారు

తడ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని అవతలి రోడ్డు వైపు దూసుకెళ్లింది. గురువారం సాయంత్రం శ్రీసిటీ నుంచి సూళ్లూరుపేటకు వెళ్తున్న కారు చేనిగుంట జాతీయ రహదారి వద్ద అదుపుతప్పింది. డివైడర్‌ను ఢీకొని చెన్నై రహదారి వైపు దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం దెబ్బతినగా, అందులో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి గాయాలు కాలేదు. అదే సమయంలో చెన్నై వైపు వెళ్లే రోడ్డుపై ఎటువంటి వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ నేత మృతి



రమణయ్య (ఫైల్‌ఫొటో)

కోట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో టీడీపీ నేత మృతి చెందిన ఘటన గురువారం రాత్రి చిట్టేడు వద్ద జరిగింది. కోట మండలం మద్దాలి గ్రామానికి చెందిన కాకాణి రమణయ్య(55) పొలంలో పనికి కూలీలను మాట్లాడేందుకు చిట్టేడుకు బైక్‌లో బయలుదేరారు. చిట్టేడు వద్దకు చేరుకునే సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో రమణయ్య అక్కడిక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పవన్ కుమార్ చెప్పారు.

టీడీపీలో కష్టపడే వారికి సముచితస్థానం: విజయశ్రీ



సూళ్లూరుపేట సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన పరిశీలకుడు శివప్రసాద్, టీడీపీ నాయకుడు సుధాకర్ రెడ్డి

సూళ్లూరుపేట, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడి పనిచేసేవారికి సముచితస్థానం లభిస్తుందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. గురువారం సూళ్లూరుపేటలోని రైల్వేగేటు వద్దనున్న టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, నియోజకవర్గ పరిశీలకుడు శివప్రసాద్ సమక్షంలో సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల సంస్థాగత ఎన్నికలు నిర్వహించారు. ముందుగా తడ మండలం నాయకులతో సమావేశమయ్యారు. మండలం అధ్యక్షులుగా పూడి శెల్వం, నీలకంఠం పేర్లు, కార్యదర్శులుగా బొమ్మన్ జయ రామయ్య, చెల్లయ్య, తొప్పాని మల్లికార్జున్ పేర్లను ప్రతిపాదించారు. అదేవిధంగా దొరవారిసత్రం మండలం అధ్యక్షులుగా వేమసాని శ్రీనివాసులు నాయుడు, వంకా సుధాకర్ యాదవ్, నందిపాటి భాస్కర్‌లను, కార్యదర్శులుగా పి.మనోహర్‌రెడ్డి, సంచి విజయకుమార్, వేమసాని నాగేంద్ర నాయుడు పేర్లను ప్రతిపాదించారు. అలాగే సూళ్లూరుపేట మండల అధ్యక్షులుగా కరకంబేటి సుబ్రహ్మణ్యం కొక్కు. శంకరయ్య, పాకం వెంకసుబ్బయ్య, దువ్వూరు మురళీరెడ్డి, పర్వతరెడ్డి చంద్రారెడ్డి, బూరగ జానకిరామయ్య, తోట వెంకట్రాయులు, కార్యదర్శులుగా సత్యవేటి ముత్యం ప్రసాద్, గోవిందు సురేష్, వెట్టి అక్కులయ్య, అక్కరపాక మణికంఠ, మెళ్లకంట వీరయ్య పేర్లను ప్రతిపాదించారు. అనంతరం సూళ్లూరుపేట పట్టణ అధ్యక్ష పదవికి పచ్చవ మాధవనాయుడు, ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, కార్యదర్శులుగా మేడా సాయి నారాయణ, ఎస్.సురేష్ నాయుడు, అబ్దుల్ నవాబ్, ఎస్‌కే అక్బర్ బాషా, ఎస్‌కే ఆలీభాయ్ పేర్లను ప్రతిపాదించడం జరిగింది. వీరందరి పేర్లను అధిష్టానానికి పంపి ఐవీఆర్ కాల్స్‌లో 70 శాతం పైగా ఓటింగ్ వచ్చిన వారిని నియమించడం జరుగుతుందని ఎమ్మెల్యే విజయశ్రీ పేర్కొన్నారు. సమావేశంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని శ్రీనివాస ఫంక్షన్‌హాల్‌లో నాయుడుపేట, పెళ్లకూరు, తడ సంస్థాగత ఎన్నికలు జరిగాయి. నాయుడుపేట పట్టణ అధ్యక్షులుగా కందలకృష్ణారెడ్డి, షేక్ రఫీ, మండల అధ్యక్షులుగా కామిరెడ్డి అశోక్‌రెడ్డి, సన్నారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేర్లను ప్రతిపాదించారు. అలాగే ప్రధాన కార్యదర్శుల పదవులకు పలువురు దరఖాస్తులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పల్లమాల రామిరెడ్డి, శ్రీరామ్‌ప్రసాద్, కట్టా రమణారెడ్డి, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక యాజమాన్య పద్ధతులపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఆత్మ పీడీ మురళి

కోట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పంటలు సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందని నెల్లూరు వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) పీడీ మురళీ అన్నారు. మండల పరిధిలోని గూడలి, తిన్నెలపూడి గ్రామాల్లో గురువారం ఆత్మ అధికారుల ఆధ్వర్యంలో నూతన వరి వంగడాలపై క్షేత్ర ప్రదర్శన జరిగింది. రైతులకు సాంకేతిక యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ప్రతి సీజన్‌లో వరి పండించడం వల్ల అధిక లాభాలు పొందలేరని, వాటి స్థానంలో మొక్కజొన్న వంటి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తే అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కలిగి ఉండటమే కాకుండా మార్కెటింగ్ సదుపాయాలపై దృష్టి పెడితే మరింత లాభాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏవో సుచేంద్ర ప్రసాద్, వ్యవసాయ విస్తరణాధికారి సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ విండోలకు నూతన అధ్యక్షుల నియామకం



రామచంద్రయ్య నాయుడు, రమణారెడ్డి, సురేంద్ర, రాజా, జనార్ధనరెడ్డి, చైతన్య, భాస్కర నాయుడు

దక్కిలి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): దక్కిలి మండలంలో ఏడు సింగిల్ విండోలకు అధ్యక్షులను నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. మాధవాయపాళెం సొసైటీ అధ్యక్షుడిగా మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, దక్కిలి సొసైటీ అధ్యక్షుడిగా వెలికంటి రమణారెడ్డి, దగ్గవోలు సొసైటీ అధ్యక్షుడిగా పాతనాలపాడు గ్రామానికి చెందిన ఈతముక్కల సురేంద్ర, లింగముద్రం సొసైటీ అధ్యక్షుడిగా నాగులపాడు గ్రామానికి చెందిన రంగినేని రాజా, మోపూరు సొసైటీ అధ్యక్షుడిగా పులి జనార్ధనరెడ్డి, అల్లూరుపాడు సొసైటీ అధ్యక్షుడిగా చైతన్య, గొల్లపల్లి సొసైటీ అధ్యక్షుడిగా నర్రావుల భాస్కర నాయుడును నియమితులయ్యారు. తమను సింగిల్ విండోల అధ్యక్షులుగా నియమించడానికి కృషి చూసిన ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యమాలకు ఊపిరి యూటీఎఫ్

కోట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఉద్యమాలకు ఉపిరిపోసింది యూటీఎఫ్ అని ఆ సంఘ నేతలు అన్నారు. మండల పరిధిలోని చిట్టేడు, కేశవరం, మద్దాలి, చెందోడు, కొత్తపాళెం గ్రామాల్లోని పాఠశాలల్లో గురువారం యూటీఎఫ్ నాయకులు సభ్యత్వ నమోదు చేపట్టారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు మనోహర్, ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రావు, సంఘ ప్రతినిధులు కోటేశ్వరరావు, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి టౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): గర్భిణులు బిడ్డకు జన్మనిచ్చే వరకు పౌష్టికాహారం తీసుకోవాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. గురువారం స్థానిక పద్మశాలి కల్యాణ మండపంలో తల్లిపాల వారోత్సవాలు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే గర్భిణులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో సీడీపీవో షంషాద్ బేగం, నాయకులు జానపాటి బాలకృష్ణ, గంగాధర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లిలో తల్లిపాల వారోత్సవాలు

కోట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పుచ్చలపల్లిలో గురువారం తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణమ్మ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు అనిత, ప్రసన్న గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యంపై అవగాహన కల్పించారు.

ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అక్రమాలపై విచారణ చేపట్టండి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ డిమాండ్ చేసింది. ఈ విషయమై యూనివర్సిటీ రిజిస్ట్రార్ భూపతి నాయుడికి ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున, నేషనల్ లా విద్యార్థి సంఘం అధ్యక్షుడు సుందర్రాజు గురువారం వినతిపత్రం అందజేశారు. మల్లికార్జున మాట్లాడుతూ ఉద్యోగం వచ్చిన ప్రతి విద్యార్థి నుంచీ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మూడువేల నుంచి పదివేల రూపాయల వరకు అక్రమంగా వసూలు చేశారని ఆరోపించారు. ఐదేళ్లుగా ఈ వ్యవహారం నడిచిందని తెలిపారు. ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి విచారణ చేపట్టాలని కోరారు. ఆయన వసూలు చేసిన డబ్బును యూనివర్సిటీ అకౌంట్లోకి జమ చేయాలని, లేకపోతే విద్యార్థులతో కలిసి ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముఖేష్, కుమార్ పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో మంత్రి అనగాని

తిరుచానూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని గురువారం ఉదయం జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ దర్శించుకున్నారు. ఆలయం వద్ద డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, సూపరింటెండెంట్ రమేష్ ఆయనకు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం ఇచ్చి అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు.


ఉపాధ్యాయుడిపై తప్పుడు కేసు తగదు

బాలాయపల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని జయంపు ఎస్టీకాలనీ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న చిన్నఅంకయ్యపై నమోదు చేసిన పోక్సో కేసు నమోదు చేయడం సరికాదని విద్యార్థుల తల్లిదండ్రులు అన్నారు. గురువారం వారు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ అభిప్రాయాలు తెలుసుకోకుండా ఉపాధ్యాయుడిపై ఎంఈవో ఫిర్యాదు ఎలా చేస్తారని ప్రశ్నించారు. చిన్నఅంకయ్యపై తప్పుడు కేసు పెట్టి ఇరికించారని, వెంటనే కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

మందుల దుకాణంలో మత్తుపదార్థాల విక్రయం

గూడూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆస్పత్రి రోడ్డులో గల ఓ మందుల దుకాణంలో నిషేధిత మత్తు పదార్థాలు విక్రయిస్తున్న విషయం గురువారం వెలుగుచూసింది. స్థానిక ఆస్పత్రి రోడ్డులోని ఓ మందుల దుకాణంలో నిషేధిత మత్తుపదార్థాలను విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో బుధవారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. విచా రణ జరుగుతోందని, పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు చెప్పారు.

ఘనంగా ఇసనాక వర్ధంతి



ఇసనాక చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నూకలపాలెం వాసులు

సూళ్లూరుపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ ఆలయ మాజీ ట్రస్టుబోర్డు ఛైర్మన్ స్వర్గీయ ఇసనాక హర్షవర్ధన్ రెడ్డి వర్ధంతిని మున్సిపాలిటీ పరిధిలోని నూకలపాలెంలో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఇసనాక చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు

టీటీడీలో పదోన్నతులు ఎందుకు ఆపేశారు?

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): టీటీడీలో ఐదేళ్లుగా పదోన్నతులు ఎందుకు ఆపేశారో చెప్పాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. టీటీడీలో ఎస్సీ, ఎస్టీ రోస్టర్ పాయింట్‌లో ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సుదీర్ఘకాలంగా ఉద్యోగులకు పదోన్నతులు నిలిపివేయడం ధర్మమా అని ప్రశ్నించారు. ధర్మాన్ని ఆచరించే సంస్థలో ఇలా జరగడం సమంజసం కాదని విమర్శించారు. పదోన్నతులకు అర్హత ఉన్న 100 మందికిపైగా ఉద్యోగ విరమణ చేశారని, మరో 100 మంది కారుణ్య నియామకాల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. వెంటనే పదోన్నతులు కల్పించి, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

10న భగవద్గీత పారాయణం

తిరుపతి(ఎంఆర్‌పల్లె), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): శ్రీఅన్నమయ్య డ్యాన్స్ అకాడమీ, అప్సా ఆధ్వర్యంలో కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం వరకు తిరుపతి రఘునాథాచార్య ఓపెన్ ఆడిటోరి యంలో భగవద్గీత పారాయణం, నృత్యగాన కార్యక్రమం నిర్వహించ నున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో పోస్టర్లు ఆవిష్కరించారు.

ఇసుక, గ్రావెల్ మాఫియా ఆపకపోతే ఆందోళన

సూళ్లూరుపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఇసుక, గ్రావెల్ దోపిడీ జరుగుతుంటే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని మాజీ కిలివేటి సంజీవయ్య ప్రశ్నించారు. గురువారం ఆయన వైసీపీ నాయకులతో కలిసి ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాపై ఆర్డీవో కిరణ్మయితో మాట్లాడారు. నాయుడుపేట, దొరవారిసత్రం, సూళ్లూరుపేటలో పట్టపగలే గ్రావెల్, ఇసుకను ఇష్టానుసారంగా తవ్వేసి తమిళనాడుకు తరలిస్తుంటే రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినా ఎందుకు చర్యలు తీసుకోవడం ప్రశ్నించారు. పది రోజుల్లో మాఫియాను అరికట్టేందుకు చర్యలు తీసుకోకపోతే ప్రజలతో కలిసి ఆందోళనకు దిగుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అల్లూరు అనిల్‌రెడ్డి, వైసీపీ నాయకులు జెట్టి వేణుయాదవ్, చిలకా యుగంధర్, కలికి మాధవ రెడ్డి, మునస్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ ఛైర్‌పర్సన్‌గా అర్చన



చిల్లకూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ ఛైర్‌పర్సన్‌గా అర్చన నియమితులయ్యారు. ఛైర్‌పర్సన్‌తో పాటు ఆలయ కమిటీ సభ్యులను నియమిస్తూ గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఛైర్‌పర్సన్‌గా అర్చన, కమిటీ సభ్యులుగా వాసవి, రాజమ్మ, వెంకటసుబ్బయ్య, చలపతి, చెంగలరాయుడు, ముత్యాలమ్మ, వెంకటేశ్వర్లు, ఆదిశేషమ్మ, ఎక్స్ అఫిషియో సభ్యుడుగా ఎస్‌పీ.చిరంజీవిలను నియమించింది. తమకు పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్, టీడీపీ సీనియర్ నాయకులు కొండేపాటి గంగాప్రసాద్, తానంకి నానాజీలకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రైల్లో కత్తితో ఆకతాయి హల్‌చల్

అదుపులోకి తీసుకున్న ఆర్‌పీఎఫ్ పోలీసులు



రైలు వద్ద గుమికూడిన ప్రయాణికులు

సూళ్లూరుపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చెన్నై - భగత్ కోటి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో ఓ ఆకతాయి కత్తితో హల్‌చల్ చేయడంతో ప్రయాణికులు భయాందోళనకు గురైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. చెన్నై నుంచి వస్తున్న రైలులో ఓ గుర్తు తెలియని వ్యక్తి కత్తితో ప్రయాణికులను బెదిరిస్తూ హల్‌చల్ చేశారు. దీంతో ప్రయాణికులు ఆన్‌లైన్ ద్వారా రైల్వే పోలీసులకు సమాచారం చేరవేశారు. అప్రమత్తమైన రైల్వే పోలీసులు సూళ్లూరుపేట స్టేషన్‌లో రైలును ఆపేసి ఆకతాయి కోసం భోగిల్లో గాలించారు. ఆర్‌పీఎఫ్ పోలీసులను చూసిన ఆకతాయి బీ2 బోగిలో బాత్‌రూంలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. ఆర్‌పీఎఫ్ పోలీసులు దాదాపు గంటసేపు శ్రమించి బాత్‌రూం తలుపులు తీసి ఆకతాయిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వ్యక్తి తమిళంలో ఒక్కొక్కసారి ఒక్కో విధంగా మాట్లాడుతుండడంతో మతిస్థిమితం లేనినట్లు అనుమానిస్తున్నారు. ఈ ఘటనతో పలు రైళ్లు ఆలస్యంగా నడిచాయి.

అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న మినీ లారీ

పురోహితుడి కుటుంబసభ్యులకు గాయాలు





ప్రమాదంలో దెబ్బతిన్న మినీ లారీ, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చాణిక్య

ఏర్పేడు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఓ మినీ లారీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో పురోహితుడి కుటుంబసభ్యులకు గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం ఏర్పేడు మండలంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గుంటూరుకు చెందిన లక్ష్మీనరసింహ శర్మ కొంతకాలంగా తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూరు ఆలయం కన్యకాపరమేశ్వరి ఆలయంలో పురోహితుడుగా పనిచేస్తూ అక్కడే కాపురం ఉంటున్నాడు. 15రోజుల క్రితం తన సోదరుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో అంత్యక్రియలు, కర్మక్రియలు కార్యక్రమాలకు గుంటూరు వచ్చాడు. కార్యక్రమాలను ముగించుకుని తిరిగి బుధవారం రాత్రి ఇంటి సామాన్లతో మినీ లారీలో వేసుకుని భార్య, బిడ్డలతో బయలుదేరాడు. మార్గమధ్యమైన ఏర్పేడు మండలం అంజిమేడు సమీపంలో పూతలపట్టు -నాయుడుపేట జాతీయ రహదారిపై అదుపు తప్పిన లారీ డివైడర్‌ను గురువారం ఉదయం ఢీకొంది. ఈ ప్రమాదంలో లక్ష్మీనరసింహశర్మ (38)తో పాటు భార్య విశాలి(33), కుమారుడు చాణిక్య(7), కుమార్తె శృతి(5)కి గాయాలయ్యాయి. చాణిక్యకు తీవ్రగాయాలయ్యాయి. వారిని 108లో బాలాజీ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చాణిక్య అక్కడ చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై ఎలాంటిపోలీసు కేసు నమోదు కాలేదు. ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాన్ని పోలీసులు ఏర్పేడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ నాగరాజును అదుపులోకి తీసుకున్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

నాణ్యమైన ఆహారాన్ని అందించండి
ఫుడ్ కమిషన్ సభ్యురాలు దేవి



అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న దేవి

రేణిగుంట, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రంలోని పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు దేవి ఆదేశించారు. గురువారం మండలం పరిధిలోని విప్పమాను పట్టెడ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవోలు కృష్ణవేణి, శాంతి, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నేతన్నలకు ఘనసన్మానం



చేనేతలను సన్మానిస్తున్న కోలా ఆనంద్; విజయకుమార్

శ్రీకాళహస్తి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భాస్కరపేటలో టీడీపీ నాయకులు చల్లా గోవిందు ఆధ్వర్యంలో ఘనంగా 11వ జాతీయ చేనేత దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్ హాజరయ్యారు. పలువురు చేనేతలను ఘనంగా సత్కరించారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాన్, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కోలా ఆనంద్, విజయకుమార్ మాట్లాడుతూ నేత కార్మికులకు ఉచిత విద్యుత్ ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గరికపాటి రమేష్‌బాబు, టీడీపీ నాయకులు కన్నా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయండి
మంత్రికి టీడీపీ నాయకుల వినతి



కేవీబీపురం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని గురువారం మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కేవీబీపురం మండల టీడీపీ నాయకులు విన్నవించారు. గతప్రభుత్వ హయాంలో టీడీపీ సర్పంచులు చేసిన పనులకు బిల్లులు చెల్లించకుండా వేధించారని ఇప్పటికీ ఆ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రితో పాటు సత్యవేడు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి ఉన్నారు. స్పందించిన మంత్రి త్వరలోనే బిల్లులు వచ్చేలా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామాంజుల నాయుడు, గోపీనాథ్‌రెడ్డి, మునస్వామియాదవ్, సురేష్‌రెడ్డి, సర్పంచ్ సురేష్, ప్రకాష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కుర్రకాలువలో అక్రమ ఇళ్ల కూల్చివేత



రేణిగుంట, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కుర్రకాలువలో అక్రమంగా నిర్మించిన ఇళ్లను రెవెన్యూ అధికారులు కూల్చి వేశారు. గురువారం సాయంత్రం జీపాల్యం పంచాయతీ కుర్రకల్వ, పద్మానగర్‌లో కుర్రకాలువ లెక్కదాఖలా సర్వేనెంబర్ 2081, 2, 2091, 2లో ప్రభుత్వ అవసరాలకు కేటాయించిన భూమిలో వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆక్రమించుకొని 77 ఇళ్లు నిర్మించుకున్నారు. ఈ క్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి పోలీసుల సాయంతో ఎక్స్‌కవేటర్‌తో ఆ ఇళ్ల కూల్చి వేయించారు. ఎస్‌ఐ సుధాకర్ పోలీస్ సిబ్బంది, ఆర్‌ఐ జయకృష్ణ, వీఆర్వో నలిని పాల్గొన్నారు.

సమగ్ర ఎరువులను వాడితే లాభదాయకం

కేవీబీపురం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): వరిలో సమగ్ర ఎరువులను వాడితే రైతులకు లాభదాయకమని పీఎంఆర్‌కేవీవై పథకం కింద జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి వేణుగోపాల్‌రావు చెప్పారు. గురువారం మండలంలోని తిమ్మసముద్రం గ్రామంలో రైతులకు శిక్షణా కార్యక్రమం వ్యవసాయాధికారి మురళీకృష్ణకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ సేంద్రీయ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు, జీవన ఎరువులు, రసాయన ఎరువులను సమతుల్య పద్ధతిలో వాడినట్లయితే పంట దిగుబడి ఎక్కువగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు థామస్, ఏఈవో రవిప్రకాష్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

నారాయణవనం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని నారాయణవనం జడ్పీ ఫైనాన్స్ సభ్యులు కోనేటి సుమన్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని పీహెచ్‌సీలో ఈ నెల 12న నిర్వహించనున్న నులి పురుగుల నిర్మూలన కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న నులి పురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలను ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ దర్శిత్ రాజు, సీహెచ్‌వో హరినాథ్, సూపర్‌వైజర్ యశోదమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ వీరాస్వామి, స్టాఫ్ నర్సులు, గ్రామ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న చేనేత కార్మికులు

నారాయణవనం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలో గురువారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గాంధీ మండపం వద్ద చేనేత సంఘం నాయకులు అచ్చుకట్ల హరి ఆధ్వర్యంలో స్థానిక గాంధీ విగ్రహానికి నూలును చుట్టి నివాళులు అర్పించారు. అనంతరం చేనేతలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్‌ను అందజేసిన సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కరన్, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

కంటైనర్ లారీ బోల్తా వ్యాపించిన మంటలు

రేణిగుంట ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కంటైనర్ లారీ బోల్తా కొట్టడంతో నిప్పు అంటుకుంది. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున మర్రిగుంట కూడలిలో చోటుచేసుకుంది. గాజులమండ్యం ఎస్‌ఐ సుధాకర్ కథనం మేరకు.. శ్రీసిటీ నుంచి బెంగళూరుకు లోడుతో వెళుతున్న కంటైనర్ అతివేగంగా వస్తూ మర్రిగుంట కూడలిలో అదుపుతప్పింది. డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో బోల్తా కొట్టింది. నిప్పు అంటుకుంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు.

యాత్రికులతో మర్యాదగా వ్యవహరించండి

రేణిగుంట ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): యాత్రికుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర సూచించారు. గురువారం రేణిగుంట పోలీస్‌స్టేషన్లో రైల్వేస్టేషన్‌లోని ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ దేశంలో వివిధ ప్రాంతాల నుంచి శ్రీవారి దర్శనార్థం తిరుమలకు యాత్రికులు వస్తుంటారని గుర్తుచేశారు. వారితో గౌరవంగా వ్యవహరించి మన ఊరి గౌరవం పోకుండా చూసుకోవాలని సూచించారు. అమర్యాదగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇచ్చిన హామీ నెరవేర్చిన చంద్రబాబు

శ్రీకాళహస్తి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): హజ్ యాత్ర ముస్లింలకు ఒక్కొక్కరికి రూ.లక్ష ఇచ్చి సీఎం చంద్రబాబు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని టీడీపీ రాష్ట్ర మైనార్టీ విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి షాకీరాలీ అన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇమామ్, మౌజన్లకు వేతనం, విదేశీ విద్య కింద చదువుకునే వారికి ఉపకార వేతనాలు అందజేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు.

తల్లిపాల ఆవశ్యకత గుర్తించాలి

ఏర్పేడు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తల్లిపాల ఆవశ్యకతను ప్రతి తల్లీ గుర్తించాలని అంగన్వాడీ వర్కర్లు గురువారం పలు అంగన్వాడీ కేంద్రాల్లో అవగాహన కల్పించారు. సీతారాంపేట, నాగంపల్లి, అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ భారతి, కార్యకర్తలు సంధ్య, లక్ష్మి, విజయలక్ష్మి, జయంతి, అనూష, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ముగిసిన తల్లిపాల వారోత్సవాలు



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు, ఆశ కార్యకర్తలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం ఎర్రగుడిపాడు అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ప్రగతి స్వచ్ఛంద సంస్థ సమన్వయకర్త చంద్రశేఖర్ చిన్నారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలింతలు, గర్భవతులు, చిన్నారులు, కార్యకర్త లీలమ్మ పాల్గొన్నారు.

డాక్టర్ స్వామినాథన్ సేవలు చిరస్మరణీయం

సత్యవేడు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): హరిత విప్లవ పితామహుడు డాక్టర్ స్వామినాథన్ దేశంలో వ్యవసాయ రంగ అభివృద్ధికి అందించిన సేవలు చిరస్మరణీయమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్ తెలిపారు. స్వామినాథన్ జయంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో స్వామినాథన్ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మురళి పాల్గొన్నారు.

చవితి వేడుకలకు అనుమతులు తప్పనిసరి

వరదయ్యపాళెం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకలకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని ఎస్‌ఐ మల్లికార్జున గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండపాలు ఏర్పాటు చేయాలనుకున్న నిర్వాహకులు వారం రోజులకు ముందు పోలీస్ స్టేషన్ నుంచి అనుమతి పొందాలని వివరించారు. మండపాలను ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండపాల వద్ద సరైన లైటింగ్, అగ్ని ప్రమాద నివారణకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని పేర్కొన్నారు.

తల్లిపాలతోనే ఆరోగ్యమైన సమాజం

వరదయ్యపాళెం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలతోనే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని సీడీపీవో దేవకుమారి తెలిపారు. మండలంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న తల్లిపాల వారోత్సవాలు గురువారం మత్తేరిమిట్టలో ముగిశాయి. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిల్ప, ముఖ్య అతిథిగా విచ్చేసిన సీడీపీవో దేవ కుమారి, ఎంఎల్‌హెచ్‌పీ రిబాక, ఏఎన్‌ఎం రోస్లిన్, ఎంఎస్‌కే సునీత పాల్గొన్నారు.

శ్రీరామచంద్రా...నీకే రక్షణ లేదా..?

- పంగూరులో ఆలయ మాన్యం హాంఫట్
- 2.09 ఎకరాలకు అక్రమ పట్టాలు
- పట్టించుకోని రెవెన్యూ
- నిరసనగా దున్నకాలు చేపట్టిన గ్రామస్తులు



ఏర్పేడు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం ఇటు పారిశ్రామికంగా అటు విద్యాకేంద్రంగా అభివృద్ధి చెందడంతో అక్రమార్కుల కన్ను ఇక్కడి భూములపై పడింది. ఎక్కడ ప్రభుత్వ భూమి కనిపించినా కబ్జాకు పాల్పడుతున్నారు. గుడి, బడి ఆధీనంలో ఉన్న భూములకు పట్టాలు సృష్టించుకుని కొట్టేస్తున్నారు. ఈ క్రమంలో ఏకంగా రాములవారి గుడి మాన్యానికి సంబంధించిన భూమికి సైతం అక్రమార్కులు పట్టాలను సృష్టించారు. ఈ తంతు పాగాలి రెవెన్యూలో చోటు చేసుకుంది.

ఇదీ చరిత్ర

1978లో ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో సొసైటీ కింద పాగాలి రెవెన్యూ పరిధిలోని పంగూరు గ్రామానికి చెందిన ప్రతి కుటుంబానికీ ఎకరా చొప్పున అప్పటి ప్రభుత్వం పంపిణీ చేసింది. అప్పట్లో గ్రామస్తుల అభిప్రాయం మేరకు ఈ పొలాలకు మధ్యలో ఉన్న సర్వే నెంబరు 204లో 2.09 ఎకరాలను గుడి మాన్యానికి అధికారులు కేటాయించారు. అప్పటి నుంచి శ్రీరాముల గుడి మాన్యం భూమిని ఆలయ పూజారి సాగు చేసుకుని జీవించేవాడు. ఆ భూమిని ఏడేళ్ల క్రితం మాజీ వీఆర్వో అండదండలతో ఓ కుటుంబం అక్రమ పట్టాలు సృష్టించుకుంది. అప్పటినుంచి ఆ భూమిలో ప్రవేశించడానికి ఆ కుటుంబం ప్రయత్నం చేస్తూ ఉంది. అది తెలుసుకున్న పంగూరు గ్రామస్తులు నాటి నుంచి నేటి వరకు పోరాటం చేస్తున్నారు.

ప్రస్తుతం ఏం జరుగుతోందంటే..?

వారం రోజులుగా ఆ భూముల్లో ప్రవేశించడానికి అక్రమార్కులు మళ్లీ ప్రయత్నిస్తున్నారు. ఇది తెలుసుకున్న పంగూరు గ్రామస్తులు గురువారం శ్రీరాములవాడి గుడి మాన్యం భూమిలోకి ప్రవేశించి దున్నకాలు చేపట్టారు. ఎక్సకవేటర్ సాయంతో భూమిలో ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి స్వాధీనం చేసుకున్నారు. ఈ భూమిలోకి అక్రమార్కులు ప్రవేశిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చేనేతలకు చంద్రబాబు ఆర్థిక భరోసా



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు, చేనేతలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): చేనేతలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్థిక భరోసా ఇచ్చారని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు అన్నారు. 11వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం, చేనేత వస్త్రాలపై 5శాతం మేర జీఎస్టీ మినహాయింపు, త్రిఫ్ట్ నిధులు మంజూరు పథకాలకు శ్రీకారం చుడుతున్న నేపథ్యంలో పట్టణంలోని పద్మాశాలిపేట, కుందేటివారి వీధి కూడలిలో సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కుటుంబాలకు త్వరలో ఆరోగ్యబీమా పథకం వర్తింపజేయడానికి ప్రణాళికలు రూపొంది స్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుమ్మడిపూడి దశరథాచారి, వన్నెకుల క్షత్రియ సంఘం కార్పొరేషన్ చైర్మన్ మిన్నల రవి, నాయకులు మునిరాయాదవ్, వజ్రం కిషోర్, కోట చంద్రశేఖర్, తీర్థం వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, వెంకటేష్, మురళి, మునస్వామి, యుగంధర్, శంకరయ్య, మీనమ్మ, లక్ష్మి, గీత, సులోచన, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్య సాధనకోసం కృషి చేయాలి: అశోక్ రాజు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ అశోక్‌రాజు

నారాయణవనం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్య సాధన కోసం కృషి చేయాలని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలల చైర్మన్ అశోక్ రాజు పేర్కొన్నారు. గురువారం కళాశాలలో కొత్తగా చేరిన ఇంజనీరింగ్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మోటివేటర్ భాను ప్రకాష్, చైర్మన్ అశోక్ రాజు మాట్లాడుతూ సాంకేతికత పెరుగుతున్న నేపథ్యంలో నేటి యువత దానిపై దృష్టి సారించాలని కోరారు. ప్రముఖ కంపెనీల్లో సీఈవోలుగా ఉన్న సత్యనాదెళ్ల, సుందరపిచాయ్‌ల ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కళాశాలలో జూనియర్, సీనియర్ విద్యార్థుల మధ్య స్నేహపూరిత వాతావరణం ఉండాలన్నారు. మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. ప్రోగ్రామింగ్ కోడింగ్ మీద పట్టు సాధించాలని కోరారు. కోడింగ్ నేర్చుకుని డేటాసైన్స్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ మెషీన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్ తదితర అంశాలపై పట్టు సాధించాలని సూచించారు. ఈ కార్య క్రమంలో ప్రిన్సిపాల్స్ జనార్ధన్‌రాజు, మధు, రమేష్, హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రోడ్ల ధ్వంసంపై మండిపడ్డ జనం: టిప్పర్ల అడ్డగింత



బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుత్తేరి, పిల్లేటివారికండ్రిగ, ఆలత్తూరు గ్రామాలలో టిప్పర్లు అధికలోడ్లతో తిరగడం వలన రోడ్లు ధ్వసం అవుతున్నాయని గ్రామస్తులు గురువారం టిప్పర్లను అడ్డుకుని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామాల నుంచి నిత్యం పదుల సంఖ్యలో టిప్పర్లు అధిక లోడ్లతో మెటల్, దుమ్ము చెన్నై, సూళ్లూరుపేట, శ్రీసిటీ, తదితర ప్రాంతాలకు పోవడం వలన రోడ్లు పూర్తిస్థాయిలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రయాణం దుర్భంగా మారిందన్నారు. ఐదేళ్లుగా ఆలత్తూరు, పిల్లేటివారికండ్రిగ, పుత్తేరి రహదారులకు మరమ్మతులు చేపట్టని కారణంగా రోడ్లు ఛిద్రంగా మారాయని తెలిపారు. పలుమార్లు ప్రజా ప్రతినిధులు, అధికారులకు తెలిపినా పట్టించుకోలేదన్నారు. రోడ్లకు కనీస మరమ్మతులు చేపట్టాలని క్వారీ యాజమానులను కోరినా పట్టించుకోలేదన్నారు. రోడ్లు సక్రమంగా లేకపోవడంతో 108, 104 వాహనాలు, పాఠశాల బస్సులు, ఆటోలు తమ గ్రామాలకు రావడం లేదన్నారు. రోడ్లకు బాగుచేసిన తర్వాతే టిప్పర్లను తిప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ప్రసాద్‌పాల్, వేణుగోపాల్‌రెడ్డి, చిన్నికృష్ణ, లక్ష్మీనారాయణ, చెంచమ్మ, సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిలుక వాహనంపై నీలకంఠేశ్వరుడి రాజసం



శ్రీకాళహస్తి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులో వెలసిన అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరస్వామి గురువారం చిలుక వాహనంపై గ్రామ వీధుల్లో విహరించారు. ముందుగా స్వామి అమ్మవార్లకు ఆలయంలో విశేష అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించారు.మేళతాళాలు,మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల మధ్య స్వామి అమ్మవార్లు చిలుక వాహనంపై కొలువుదీరి గ్రామవీధుల్లో విహరించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు.

పౌష్టికాహారంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ



సరస్వతిబాయి పాఠశాలలో భోజన నాణ్యతను పరిశీలిస్తున్న ఫుడ్ కమిషన్ మెంబర్ దేవి

శ్రీకాళహస్తి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహరం పంపిణీపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని ఫుడ్ కమిషన్ సభ్యురాలు దేవి అన్నారు. శ్రీకాళహస్తిలో గురువారం పలుచోట్ల ఆమె ఆకస్మిక తనిఖీలు చేశారు. ముందుగా తెలుగుగంగ కాలనీలోని సరస్వతిబాయి పురపాలకసంఘ ఉన్నతపాఠశాలలో భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థుల నుంచి చాలీచాలని కూరలు, కర్రీస్ ఇస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయి. దాంతో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బృందాదేవిని వివరణ కోరారు. ఆమె పొంతన లేని సమాధానం ఇవ్వడంతో విద్యార్థులకు అందించే భోజనం విషయంలో రాజీ పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వీఎంసీ కూడలి, కొండమిట్ట ప్రాంతాల్లోని రేషన్‌దుకాణాలను, సివిల్‌సప్లై గోదామును పరిశీలించారు. ఆహారభద్రత విషయంలో ఎక్కడా ప్రభుత్వం రాజీ పడటం లేదన్నారు. క్షేత్రాస్థాయిలో విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహార నాణ్యత, ప్రమాణాలు అందజేయడమే ధ్యేయంగా ప్రత్యేక దృష్టిసారిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో శాంతిదుర్గ, ఎంఈవో బాలయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరలక్ష్మీ వ్రతానికి సర్వం సిద్ధం

శ్రీకాళహస్తి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాహస్తీశ్వరాలయం ప్రాంగణంలోని బ్రహ్మగుడి వద్ద శుక్రవారం జరగనున్న వరలక్ష్మీ వ్రతానికి ఆలయ అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ వ్రతం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరగనుంది. వ్రతంలో పాల్గొనే వారికి ఇచ్చేవాయినాలను ఆలయ అధికారులు, సిబ్బంది సిద్ధం చేస్తున్నారు.





బ్రహ్మగుడి ఆలయం వద్ద చేసిన ఏర్పాట్లు, భక్తులకు అందించే పసుపు, కుంకుమ తదితరాలను సిద్ధం చేస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేథో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. విశేషంగా అలంకరించారు. పలు హారతులు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

ముందస్తు రక్షాబంధన్



శ్రీకాళహస్తి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌కాలనీలో గల శ్రీచైతన్య పాఠశాలలో గురువారం ముందస్తు రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులు రాఖీలు కట్టుకున్నారు. ప్రిన్సిపాల్ రూపాదేవి, ఏజీఎం సురేష్, కో-ఆర్డినేటర్ అమ్మాజీ, ఇన్‌చార్జిలు వాసంతి, కల్పన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రదోష నంది సేవ



శ్రీకాళహస్తి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి):: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం శాస్త్రోక్తంగా ప్రదోష నందిసేవ జరిగింది. ముందుగా ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామి అమ్మవార్లను మంగళవాయిద్యాలు, మేళతాళలు, వేదమంత్రాల నడుమ నందిపై అధిష్టింపజేశారు. ఆలయ ప్రాకారంలో ప్రదోష నందిసేవ నిర్వహించారు.

వసతులు కల్పించండి

నారాయణవనం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలో ద్రౌపదిదేవి సమేత ధర్మరాజుల స్వామి తిరునాళ్ల సందర్భంగా విచ్చేయుచున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించాలని జడ్పీటీసీ సభ్యులు కోనేటి సుమన్‌కుమార్ సూచించారు. గురువారం ఆయన ధర్మరాజుల ఆలయానికి విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మకర్త దేశిరెడ్డి ఆయన్ను ఆలయ మర్యాదలతో ఆహ్వానిం చారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలను ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు. సర్పంచ్ శారదమ్మ చిన్నదొరై, టీడీపీ నాయకులు ఏకాంబరం, మాణక్యంరెడ్డి, బాలమురగన్, శంకరయ్య, ధర్మయ్య, ముకేష్, ఆర్ముగం పాల్గొన్నారు.